# జోగులాంబ శరన్నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



**అలంపూర్ అక్టోబర్ 06 (వుదయం కరస్పాండెంట్ )**

అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠంగా, అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన జోగులాంబ అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, దర్శనం, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, విద్యుత్, అత్యవసర సేవల విషయంలో సమగ్ర ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యమే కేంద్రంగా ఏర్పాట్లు ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులకు దర్శనం, ప్రసాదం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా స్పష్టమైన దిశా సూచికలు, సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ దర్శనాల సమయంలో సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రోటోకాల్ అమలులో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. భారీ రద్దీకి ప్రత్యేక కార్యాచరణ ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి దేవస్థానం షటిల్ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల రాకపోకలను క్రమబద్ధీ కరించాలని ఆదేశించారు. అలంపూర్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచడంతో పాటు, అలంపూర్ నుంచి దేవస్థానం వరకు ప్రత్యేక షటిల్ సర్వీసులు నిర్వహించాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు తక్షణ స్పందన ఉత్సవాల సమయంలో భక్తులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్‌ను భక్తులకు విస్తృతంగా తెలియజేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేయాలని, ప్రసాదం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి కొరత లేకుండా మిషన్ భగీరథ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేవాలయ ప్రాంగణంతో పాటు ఘాట్ పరిసరాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు.వైద్య సేవలు సిద్ధంగా ఉండాలి అత్యవసర సమయాల్లో భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఘాట్ వద్ద భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఘాట్ వద్ద భక్తుల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు శిక్షణ పొందిన ఈతగాళ్లు, తగిన సంఖ్యలో లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారిణిని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఫుడ్ స్టాళ్లను అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, పరిశుభ్రతతో పాటు ఆహార నాణ్యతపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఫిట్‌నెస్ ఉన్న పడవలకే అనుమతి తెప్పోత్సవానికి వినియోగించే పడవలను ఇరిగేషన్ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న పడవలను మాత్రమే తెప్పోత్సవానికి వినియోగించాలి అని స్పష్టం చేశారు. పడవల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజిన్‌ను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. అవసరమైన సిబ్బంది, పరికరాలను అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జోగులాంబ వైభవాన్ని చాటేలా ప్రచారం అలంపూర్ ఆలయాల చరిత్ర, జోగులాంబ అమ్మవారి విశిష్టత, క్షేత్ర ప్రాశస్త్యాన్ని భక్తులకు తెలియజేసేలా సౌండ్ అండ్ లైట్స్ షో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలు, ప్రత్యేకతను సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.సమన్వయంతోనే విజయవంతం గత ఏడాది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ఈ ఏడాది మరింత మెరుగైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయ వంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, అదనపు ఎస్పీ శంకర్, దేవాలయ శాఖ ఈఓ దీప్తి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే తొలిసారి వినూత్న కార్యక్రమం



**27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం**
**రూ.9.60 కోట్లతో మునగాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శంకుస్థాపన**
**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్ మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడి అని ఆయన అన్నారు. మునగాల మండలం తాడువాయి–మాధవరం గ్రామాల మధ్య ప్రభుత్వ స్థలంలో రూ.9.60 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. *భట్టి విక్రమార్క: పిల్లల పౌష్టికాహారం.. రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడి పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పాదకతకు పెద్దఎత్తున తోడ్పడతారని భట్టి విక్రమార్క అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారిని ఆరోగ్యవంతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు వివరించారు. *మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.9.60 కోట్ల కిచెన్* మునగాల మండలంలో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా 1,020 పాఠశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం తయారు చేసి విద్యార్థులకు చేరేలా కిచెన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కోదాడ నియోజకవర్గంలో ఈ భారీ కిచెన్ నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు కార్యక్రమంలో వివరించారు. ఒకే వంటశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే విధంగా దీనిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. *ఉత్తమ్‌కుమార్‌రెడ్డి: విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం* విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు మెరుగైన విద్య, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. *సంక్షేమ కార్యక్రమాలు.. భవిష్యత్తుపై పెట్టుబడులు: భట్టి* ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఉచితాలుగా చూడవద్దని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్తులో ప్రయోజనం చేకూర్చే పెట్టుబడిగా అభివర్ణించారు.రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. *బీఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క విమర్శలు
* బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలను భట్టి విక్రమార్క ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. *నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా: భట్టి విక్రమార్క రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకురానున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించే విధంగా పథకాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. *ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్* ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే పాఠశాలలో కలిసి చదువుకునేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడా సౌకర్యాలను కల్పించనున్నట్లు వివరించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్పీ నరసింహ, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, పీసీసీ సభ్యుడు చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, వైస్ చైర్మన్ దేవర మల్లీశ్వరి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్రీడల ఆణిముత్యాన్ని సన్మానించిన కాకర్ల

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 6(వుదయం ప్రతినిధి)**

క్రీడల్లో రాణించి అండర్ 15 రాష్ట్ర స్థాయి క్రికెట్ లో చోటు సంపాదించుకున్న జంగిటి శ్రీనిధి ని ఘనంగా వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ సన్మానించారు. నారాయణపేట పట్టణంలోని మూడవ వార్డుకు చెందిన జంగిటి శ్రీనిధి పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న ప్రతిభావంతమైన క్రికెట్ క్రీడాకారిణి జె. శ్రీనిధి, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ( హెచ్ సి ఏ ) అండర్15 బాలికల రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికైన సందర్భంగా మంగళవారం కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ వార్డు ప్రజలతో కలిసి జంగిటి శ్రీనిధి ని శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయి ఎంపికకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. శ్రీనిధి ని క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ,క్రీడ కోచులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చిన్న వయసులోనే శ్రీనిధి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు అంతే కాకుండా నారాయణపేటకు క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని దాంతోపాటు నారాయణపేటకే పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని శ్రీనిధి ని కోరారు . చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని, భవిష్యత్తులో శ్రీనిధి మరింత ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, నారాయణపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.శ్రీనిధి సాధించిన ఈ ఘనత నారాయణపేటలోని ఇతర బాలికలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనిధి తల్లిదండ్రులు జంగిటి రమేష్, లత, డాక్టరేట్ కాకర్ల భీమయ్య, వార్డు ప్రజలు జంగిటి రవి కుమార్( అట్టు), తిమ్మయ్య, గడ్డమీది రాము, శివ, శ్రీనివాస్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.a

# 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం

**సంక్షేమం కాదు.. భవిష్యత్ తరానికి పెట్టుబడి: భట్టి**
**కోదాడ అక్టోబర్ 6(వుదయం):**



రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యార్థుల పౌష్టికాహారం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. కోదాడ నియోజకవర్గం మునగాలలో రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. 1,020 పాఠశాలల్లోని 60 వేల మంది విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు.సంక్షేమ పథకాలను ఉచితాలుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్ మానవ వనరులపై పెట్టుబడిగా చూడాలని అన్నారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు.

# కిచెన్‌పై ప్రచారం కంటే గురుకులాలపై దృష్టి పెట్టాలి



**ప్రభుత్వంపై బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శలు**
**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**

మునగాల మండలంలో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్‌పై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కంటే రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మునగాలలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటును స్వాగతిస్తూనే, ఇప్పటికే కొనసాగుతున్న గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతున్నదా? అనే అంశంపై ప్రభుత్వం సమీక్షించాలని ఆయన సూచించారు. గురుకులాల్లో ఆహార నాణ్యతపై అప్పుడప్పుడు ఫిర్యాదులు, ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు సురక్షితమైన ఆహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పథకాల విషయంలో ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపాలని అన్నారు.సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం కొత్తగా తీసుకొస్తున్న కార్యక్రమంగా ప్రచారం చేయడం సరి కాదని మల్లయ్య యాదవ్ అభిప్రాయపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నపూర్ణ పథకం ద్వారా ఐదు రూపాయలకే పేదలకు భోజనం అందించినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కోదాడ నియోజకవర్గంలో పేదలు, బాటసారులకు అన్నదానం నిర్వహించినట్లు గుర్తుచేశారు.అదే సమయంలో నియోజకవర్గంలోని రైతుల సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన కోరారు. వర్షాభావ పరిస్థితులు, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు, విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను పరిశీలించేందుకు హెలికాప్టర్‌లో పర్యటిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ పర్యటనల వల్ల ప్రజలకు కలిగే ప్రత్యక్ష ప్రయోజనంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని మల్లయ్య యాదవ్ ప్రశ్నించారు. ప్రజాధనం వినియోగించే ప్రతి కార్యక్రమంలో ఖర్చుప్రయోజనాలపై పారదర్శకత ఉండాలని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రజల ప్రాథమిక సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు.ప్రజా సమస్యలను పక్కనపెట్టి కేవలం ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తగిన సమయంలో తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారని బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు

# గ్రామ వెలుగు నాట్యమండలి నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా పొనుగోటి రంగా.. ప్రధాన కార్యదర్శిగా గండు వీరయ్య**
**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**





సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన కీర్తిశేషులు శ్రీ కేవెల్ నరసింహారావు 1946లో స్థాపించిన గ్రామ వెలుగు నాట్యమండలి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాట్యమండలి అధ్యక్షుడిగా పొనుగోటి రంగా, ప్రధాన కార్యదర్శిగా గండు వీరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గవిని పెద్ద లక్ష్మీనరసింహం, ఉపాధ్యక్షుడిగా పల్లపు నాగరాజు, సహాయ కార్యదర్శిగా బెజవాడ శ్రీను, కోశాధికారిగా కుంటిగోర్ల చిన్న వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు పొనుగోటి రంగా మాట్లాడుతూ.. 1946లో కీర్తిశేషులు కేవెల్ నరసింహారావు స్థాపించిన గ్రామ వెలుగు నాట్యమండలికి అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై సభ్యులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో లి సభ్యులందరినీ కలుపుకొని సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కళాకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, నాట్యకళను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.నాట్యమండలి అభివృద్ధికి సభ్యులందరి సహకారం, సూచనలు, సలహాలను తీసుకుని ముందుకు సాగుతామని పొనుగోటి రంగా తెలిపారు.నూతన కార్యవర్గాన్ని నాట్యమండలి సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ, కుంటిగోర్ల కృష్ణమూర్తి, సారిక, లింగయ్య, దేవదాసు, శేఖర్, తోకల సైదులు, రామ్‌లాల్, గండు పరుశరాములు, సుధీర్, రమేష్, జితేందర్, రాజబాబు తదితర కళాకారులు పాల్గొన్నారు.

# రహదారిపై దొరికిన ఖరీదైన ఫోన్ పోలీసులకు అప్పగింత

**కోదాడ అక్టోబర్ 6(వుదయం)**




రహదారిపై దొరికిన ఖరీదైన మొబైల్ ఫోన్‌ను పోలీసులకు అప్పగించి ద్వారకుంటకు చెందిన వనపర్తి ఉపేందర్ నిజాయితీ చాటుకున్నారు. కోదాడ నుంచి ద్వారకుంటకు వెళ్తుండగా దుర్గాపురం దాటిన అనంతరం జాతీయ రహదారిపై ఫోన్ దొరికింది. వెంటనే కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు. ఫోన్ యజమానిని గుర్తించి అందజేయాలని కోరారు. ఉపేందర్ నిజాయితీని పోలీసులు, స్థానికులు అభినందించారు.

# కోర్టు చెప్పినా తీరని నిరీక్షణ!



**గద్వాల, అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వం ఇచ్చాన్న భూమికి కాగితాలు ఉన్నాయ్.. చేతిలో పట్టాలూ ఉన్నాయ్.. కానీ ఏళ్లు గడుస్తున్నా ఆ స్థలంపై హక్కు మాత్రం దక్కడం లేదు! అధికారుల చుట్టూ తిరిగీ తిరిగీ అలసిపోయిన నిరుపేదల నిరీక్షణకు అంతులేకుండా పోతోంది. ముప్పై ఏడవ వార్డు దౌదర్పల్లి దర్గా సమీపంలో ప్లాట్లు పొందిన బాధితుల సుదీర్ఘ పోరాటానికి ఇటీవల హైకోర్టు తీర్పు కొండంత అండగా నిలిచింది. న్యాయస్థానం లబ్ధిదారులకు అనుకూలంగా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ.. అధికారుల వైఖరిలో మార్పు రాకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. హైకోర్టు ఆదేశాల్లో ఏముంది? తమకు జరిగిన అన్యాయంపై లబ్ధిదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ఈ కేసును సుదీర్ఘంగా విచారించిన హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది: బాధితుల వద్ద ఉన్న ప్లాట్ పట్టాలు, రెవెన్యూ రికార్డులను తక్షణమే సమగ్రంగా పరిశీలించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు పడకల గదుల ఇల్లు (డబుల్ బెడ్‌రూమ్) లేదా ఎనభై చదరపు గజాల ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించే అంశాన్ని ప్రాధాన్యతతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. కలెక్టరేట్‌కు తీర్పు ప్రతి.. తక్షణ అమలుకు డిమాండ్ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రతితో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కోర్టు ఆదేశాలను క్షేత్రస్థాయిలో యథాతథంగా అమలు చేసి, ఏళ్లుగా నలిగిపోతున్న బాధితులకు తక్షణ ఊరట కలిగించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ముప్పై ఏడవ వార్డు కౌన్సిలర్ గంగాళం మంజులరాణి, మాజీ కౌన్సిలర్ భీంసేన్ రావు, నాయకులు చిత్తారి కిరణ్ ఉన్నారు. న్యాయం జరిగే వరకు ఆగని పోరు! తీర్పు వచ్చిన తర్వాత కూడా అధికారులు జాప్యం వహిస్తే పేదలు తీవ్రంగా నష్టపోతారని నాయకులు మండిపడ్డారు. "ప్రభుత్వం కేటాయించిన స్థలానికి హక్కులు కల్పించడంలో ఇన్ని ఏళ్ల అలసత్వం ఏంటి? కోర్టు తీర్పును గౌరవించి అమలు చేయాల్సిన బాధ్యత యంత్రాంగా నిదే" అని స్పష్టం చేశారు. బాధితులందరికీ న్యాయపరమైన హక్కులు లభించే వరకు ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు.

# అరెస్టులు సరైనవి కావు.. పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే



**ములకలపల్లి రాములు**
**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**

మునగాల మండలం ఎస్.ఎం.పేటలోని సర్వే నంబర్ 95లో 1998లో ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించిన ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన నేపథ్యంలో తనను ముందస్తుగా అరెస్టు చేయడం సరైంది కాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు అన్నారు.
మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో సూర్యాపేట పట్టణంలోని తన నివాసం వద్ద పోలీసులు తనను అరెస్టు చేశారని ఆయన తెలిపారు. మునగాల మండలానికి వస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల దృష్టికి ఎస్.ఎం.పేట భూ సమస్యను తీసుకెళ్లేందుకు అనుమతి కోరినందుకే ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు.ఎస్.ఎం.పేటలోని సర్వే నంబర్ 95లో భూములు కోల్పోతున్న పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజా ప్రతినిధిగా, ప్రజా ఉద్యమ నాయకుడిగా తన బాధ్యత అని అన్నారు.పేదల హక్కుల కోసం కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతారని, ఎస్.ఎం.పేట భూ సమస్యలో బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని ములకలపల్లి రాములు స్పష్టం చేశారు.

# ఎలివర్తిలో నూతన రేషన్ కార్డులు



**శంకర్ పల్లి అక్టోబర్ 06 (వుదయం)**

శంకర్ పల్లి మండలం ఎలవర్తి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మారేపల్లి భాగ్యలక్ష్మి పాపారావు లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాంతి రెడ్డి, జిపిఓ మహాలక్ష్మి, వార్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, నాగరాజు, నారాయణరెడ్డి, జనవాడ శ్రీలత బిక్షపతి,వరమ్మ కళ్యాణ్ శ్రీనివాస్, మారేపల్లి యాదయ్య, ఎలిమెల అమృత, నక్క స్వప్న నవీన్ కుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉచిత ఎస్సై మాక్ టెస్ట్‌లు

**సిద్దిపేట కమిషనర్ రష్మి పెరుమాళ్**
**సిద్దిపేట, అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**



రాష్ట్రంలో ఉప తనిఖీదారు (ఎస్ఐ), రక్షక భట (కానిస్టేబుల్) ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం సిద్దిపేట రక్షక భట కమిషనరేట్ ఆధ్వర్యంలో ఉచితంగా నమూనా పరీక్షలు మరియు అంతర్జాల మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ తెలిపారు. అభ్యర్థులు రాబోయే పరీక్షల్లో విజయం సాధించడం, అసలైన పరీక్షా విధానంపై అవగాహన పెంచుకోవడం మరియు సమయ నిర్వహణను మెరుగుపరుచుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉప తనిఖీదారు అభ్యర్థులకు 5 ఉచిత నమూనా పరీక్షలు (అక్టోబర్ 10 నుండి నవంబర్ 15 వరకు), రక్షక భట అభ్యర్థులకు 10 ఉచిత నమూనా పరీక్షలు (అక్టోబర్ 11 నుండి డిసెంబర్ 13 వరకు) నిర్వహించనున్నారు. వీటితో పాటు అనుభవజ్ఞులైన ఉన్నతాధికారుల ద్వారా పరీక్షా వ్యూహాలు, ప్రత్యేక మార్గదర్శకత్వం అందించబడుతుంది. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 5 నుండి అక్టోబర్ 8 వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని సీపీ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక ప్రచార పత్రంలోని సాంకేతిక సంకేతాన్ని స్కాన్ చేయడం ద్వారా గానీ, సిద్దిపేట రక్షక భట విభాగానికి చెందిన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలు మరియు అంతర్జాల జాలగూడులోని లంకె ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రక్షక భట ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి
- పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అధికారులు అవగాహన కల్పించాలి
- సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం వుదయం బ్యూరో , అక్టోబర్- 06:**



ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. తొమ్మిదవ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పోషకాహార పదార్థాలను పరిశీలించి, వాటి వినియోగం, పోషక విలువలు, తయారీ విధానం తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్ల పంపిణీ తదితర కార్యక్రమాల అమలుపై కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్, చిన్నారులతో ముచ్చటించి, వారితో కలిసి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాలను పరిచయం చేస్తూ స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. విద్యతో పాటు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై చిన్నారుల్లో చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లు పెంపొందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, పోషకాహారం అనేది కేవలం ఒక నెలకు పరిమితమైన కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం రోజువారీ జీవితంలో పాటించాల్సిన అలవాటుగా మారాలని అన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు వారి వయస్సుకు అనుగుణంగా సమతుల్య ఆహారం అందించడం అత్యంత అవసరమని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. గర్భిణులు వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనల మేరకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు అవసరమైన ఆరోగ్య పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. బాలింతలు కూడా తగినంత పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు శిశువుకు అవసరమైన పోషకాలను అందించగలరని తెలిపారు. చిన్నారులలో పోషకాహార లోపాన్ని గుర్తించి, అవసరమైన వారికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యమైన పౌష్టికాహారం, గుడ్లు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు చిన్నారుల ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, వయస్సుకు అనుగుణమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం సింగరేణి మండలం లోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి పై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇంకుడుగుంతలు, విద్యాలయాలకు అదనపు ఏకరూప దుస్తులు, సంక్షేమ శాఖ పనులు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూవో ఎ.ప్రమీల, తహసీల్దార్ ఒరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బానోతు పద్మ, సీడీపీవో కె.ఉమా, ఎంపీవో రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు

- సారపాక గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, మంచినీటి వాటర్ ట్యాంక్ వితరణ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్

**సారపాక, 6/10/26 వుదయం ప్రతినిధి:**

వాసవి క్లబ్ సారపాక గ్రేటర్, వనిత సారపాక క్లబ్‌ల ఆధ్వర్యంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ V106A డిస్ట్రిక్ట్ గవర్నర్ అధికారిక పర్యటనను పురస్కరించుకుని సారపాక గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్వీట్లు, బిస్కెట్లను పంపిణీ చేయడంతో పాటు విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ట్యాంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ V106A గవర్నర్ Vn. PROG Golden KCGF చారుగుళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్‌ను వాసవి క్లబ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ట్యాంకును ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్‌ను ఉచితంగా అందజేయడంతో పాటు స్వీట్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన గవర్నర్ వారి చదువులు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. గత తొమ్మిది నెలలుగా సారపాక గ్రేటర్, వనిత సారపాక క్లబ్‌లు నిరంతరం సమాజహిత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన కొనియాడారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయడం, పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించడం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే సేవలని తెలిపారు. వాసవి క్లబ్‌లు కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా విద్య, వైద్యం, పేదలకు సహాయం, సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అనేక రంగాల్లో సేవలను విస్తరించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలోని ఇతర వాసవి క్లబ్‌లు కూడా సారపాక గ్రేటర్, వనిత సారపాక క్లబ్‌లను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తాగునీరు, విద్యా సామగ్రి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలను అందించడం ద్వారా సమాజానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో కూడా సేవా భావం, సామాజిక బాధ్యత పెంపొందుతుందని తెలిపారు. వాసవి క్లబ్‌ల సేవా కార్యక్రమాలకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, స్వీట్లు, బిస్కెట్లను అందజేసి వారిని అభినందించారు. పాఠశాలలో మంచినీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు వాసవి క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు, పేదలు, నిరుపేద కుటుంబాలు, అవసరంలో ఉన్న వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా క్యాబినెట్ సెక్రటరీ (సర్వీసెస్) Vn. 5★ KCGF రేపాక ధనుంజయ రాజ మనోహర్, క్యాబినెట్ ట్రెజరర్ Vn. KCGF ఉడతా నగేష్ కుమార్, రీజియన్ చైర్మన్ Vn. SILVER★ KCGF బండారు కృష్ణయ్య, వీకేఎస్పీ ఇంచార్జ్ Vn. KCGF కేతేపల్లి ప్రవీణ్, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీలు Vn. KCGF చారుగుండ్ల రామకృష్ణ, Vn. KCGF రేపాక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. అలాగే సారపాక గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు రేపాక సూర్యప్రకాష్ రావు, కార్యదర్శి బచ్చు సతీష్, కోశాధికారి కంచర్ల గౌతమ్, వనిత సారపాక క్లబ్ అధ్యక్షురాలు కొంజర్ల నిరోషా, కార్యదర్శి పాల్వాయి పావని, వాసవి క్లబ్ సీనియర్ నాయకులు పచ్చిపులుసు సుబ్బారావు, లలిత కుమారి, గుడిమెట్ల సాగర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వాసవి క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలను నిర్వహించడం పట్ల స్థానికులు, తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు వాసవి క్లబ్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



## వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన భజన పోటీలు

- సూర్యాపేట పట్టణంలో మొదటి సారిగా జిల్లాస్థాయి భజన పోటీలు
- భజనలతో మార్మోగిన భానుపురి

**సూర్యాపేట, అక్టోబర్ 06 వుదయం ప్రతినిధి**



ఉమ్మడి నల్లగొండ జిల్లా వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి భజన పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ చిన్న జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్రం (పుట్టినరోజు) వేడుకల సందర్భంగా గ్రామాలలో ఉండే కళాకారులను, భజన బృందాలను ప్రోత్సహించుట కొరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు తెలిపారు. ఈ పోటీలలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి 38 భజన బృందాలు, 600 మంది భజనపరులు పాల్గొన్నారు. సూర్యాపేట వికాస తరంగిణి శాఖ చక్కటి ఏర్పాట్లు చేసిందని, జిల్లా స్థాయిలో మొట్టమొదటిసారిగా సూర్యాపేటలో ఈ భజన పోటీలు నిర్వహించడం పట్ల భజన బృందాల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సూర్యాపేట వికాస తరంగిణి శాఖ సభ్యులు చక్కటి సమన్వయంతో ఉదయం 9 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు కోలాటం, చెక్క భజన పోటీలు ఈ కార్యక్రమాలలో భాగంగా బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు కోలాటం మరియు చెక్క భజన బృందాల పోటీలు నిర్వహిస్తున్నామని వేణుగోపాలచార్యులు తెలిపారు.

## 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం

- తెలంగాణలోనే తొలిసారి వినూత్న కార్యక్రమం
- రూ.9.60 కోట్లతో మునగాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శంకుస్థాపన

**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**





రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్ మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడి అని ఆయన అన్నారు. మునగాల మండలం తాడువాయి–మాధవరం గ్రామాల మధ్య ప్రభుత్వ స్థలంలో రూ.9.60 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు.

**భట్టి విక్రమార్క: పిల్లల పౌష్టికాహారం.. రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడి**

పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పాదకతకు పెద్దఎత్తున తోడ్పడతారని భట్టి విక్రమార్క అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారిని ఆరోగ్యవంతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు వివరించారు.

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.9.60 కోట్ల కిచెన్**

మునగాల మండలంలో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా 1,020 పాఠశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం తయారు చేసి విద్యార్థులకు చేరేలా కిచెన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కోదాడ నియోజకవర్గంలో ఈ భారీ కిచెన్ నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు కార్యక్రమంలో వివరించారు. ఒకే వంటశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే విధంగా దీనిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

**ఉత్తమ్‌కుమార్‌రెడ్డి: విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం**

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు మెరుగైన విద్య, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఉచితాలుగా చూడవద్దని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్తులో ప్రయోజనం చేకూర్చే పెట్టుబడిగా అభివర్ణించారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

**బీఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క విమర్శలు**

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలను భట్టి విక్రమార్క ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా: భట్టి విక్రమార్క**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకురానున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించే విధంగా పథకాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు.

**ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్**

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే పాఠశాలలో కలిసి చదువుకునేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడా సౌకర్యాలను కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్పీ నరసింహ, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, పీసీసీ సభ్యుడు చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, వైస్ చైర్మన్ దేవర మల్లీశ్వరి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

- దసరా సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ
- మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు



**చండూరు, అక్టోబర్ 6 (వుదయం):**

చండూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని, వారి అంకితభావం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు అన్నారు. విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకుని చండూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఏ సమయమైనా, ఏ వాతావరణంలోనైనా ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమానికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పండుగ వేళ వారి ముఖాల్లో సంతోషం చూడటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తూ పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు బుషిపాక వాసు, సామ సుజాతయాదవ రెడ్డి, కొన్రెడ్డి మధు, కోడి సుష్మ వెంకన్న, కలిమికొండ పారిజాతజనార్ధన్, కటకం రమేష్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ ఖలీల్, కల్లెట్ల చంద్రకళ మారయ్య, మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఏ. సాయిభారద్వాజ్, జూనియర్ అసిస్టెంట్ ఎ. జగన్, వార్డ్ ఆఫీసర్లు జి. శ్రీరాములు, బి. సాయిరాం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యమ్. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అండ

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు
- 17 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**చింతకాని: అక్టోబర్ 6 (ఉదయం ప్రతినిధి):**

పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు చెప్పారు. చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కరుణశ్రీ అధ్యక్షతన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 17 మంది లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. కొంతకాలం చెక్కుల పంపిణీలో జాప్యం జరిగినప్పటికీ ప్రభుత్వం న్యాయపరంగా సమస్యను పరిష్కరించి పంపిణీని కొనసాగిస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఆర్ఐ ఏకవీర, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, గ్రామ సర్పంచులు జడ ప్రమీల, పర్స రామచంద్రరావు, చాపలమడుగు వీరబాబు, మొగిలి కృష్ణయ్య, ఏపూరి పద్మ, నాగులవంచ సొసైటీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, కొప్పుల గోవిందరావు, ఏఎంసీ డైరెక్టర్లు బందెల నాగార్జున, ఎస్కే కాసిం, సట్టు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల పుల్లయ్య పాల్గొన్నారు.

## 'కేవైసీఎస్' మండల అధ్యక్షుడిగా చంద్రయ్య ఎన్నిక




**ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్**

**గట్టుప్పల్, అక్టోబర్ 6(వుదయం):**

గట్టుప్పల్ మండల కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్గొండ జిల్లా కేవైసీఎస్ అధ్యక్షుడు బండారు శంకర్ కురుమ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గట్టుప్పల్ మండల కేవైసీఎస్ నూతన అధ్యక్షుడిగా కుండే చంద్రయ్య కురుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లిగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా బాల మహేష్, ఉపాధ్యక్షులుగా మాలియా హరికృష్ణ, బోడిశ వెంకటేష్, కందాల కృష్ణ, కార్యదర్శిగా అచ్చిని పవన్ కళ్యాణ్, కోశాధికారిగా వల్లూరి శ్రీశైలం ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ మాట్లాడుతూ.. కురుమల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సమాజంలో కురుమ యువత ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రావుల ఐలయ్య కురుమ, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కాలిన మల్లేశం కురుమ, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దెందే మల్లేష్ కురుమ, గ్రామ పెద్దలు, కేవైసీఎస్ నాయకులు, యువకులు, కురుమ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ వెలుగు నాట్యమండలి నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా పొనుగోటి రంగా.. ప్రధాన కార్యదర్శిగా గండు వీరయ్య**

**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**





సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన కీర్తిశేషులు శ్రీ కేవల్ నరసింహారావు 1946లో స్థాపించిన గ్రామ వెలుగు నాట్యమండలి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాట్యమండలి అధ్యక్షుడిగా పొనుగోటి రంగా, ప్రధాన కార్యదర్శిగా గండు వీరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గవిని పెద్ద లక్ష్మీనరసింహం, ఉపాధ్యక్షుడిగా పల్లపు నాగరాజు, సహాయ కార్యదర్శిగా బెజవాడ శ్రీను, కోశాధికారిగా కుంటిగోర్ల చిన్న వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పొనుగోటి రంగా మాట్లాడుతూ.. 1946లో కీర్తిశేషులు కేవల్ నరసింహారావు స్థాపించిన గ్రామ వెలుగు నాట్యమండలికి అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని నాట్యమండలి సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి చర్ల సత్యనారాయణ, కుంటిగోర్ల కృష్ణమూర్తి, సారిక, లింగయ్య, దేవదాసు, శేఖర్, తోకల సైదులు, రామ్‌లాల్, గండు పరుశరాములు, సుధీర్, రమేష్, జితేందర్, రాజబాబు తదితర కళాకారులు పాల్గొన్నారు.

## నేలమర్రి–మాధవరం రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే పద్మావతికి వినతి

**మునగాల, అక్టోబర్ 6 (వుదయం):–**



మునగాల మండలంలోని నేలమర్రి నుంచి మాధవరం వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారిందని, తక్షణమే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ నేలమర్రి గ్రామానికి చెందిన రాజీవ్ మంగళవారం కోదాడ ఎమ్మెల్యే నల్లమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ నేలమర్రి–మాధవరం రహదారి అనేక గ్రామాల ప్రజలకు నిత్య రాకపోకలకు కీలకమైన మార్గమని తెలిపారు. రహదారి దెబ్బతినడంతో రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి మరింత అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, ప్రజలు వైద్య అవసరాల నిమిత్తం సమీప పట్టణాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సంబంధిత శాఖ ద్వారా రహదారిని సర్వే చేయించి, అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరితగతిన రహదారి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## గట్టుప్పల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

**ఎకరానికి ₹30 వేల పరిహారం చెల్లించాలి: సీపీఎం డిమాండ్**

**గట్టుప్పల్, అక్టోబర్ 6 (వుదయం)**

వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన గట్టుప్పల్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యుడు కర్నాటి మల్లేశం డిమాండ్ చేశారు. గట్టుప్పల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు లేక, కరువుతో మండలంలోని రైతాంగం అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా దెబ్బతిన్న పత్తి పంటకు ఎకరానికి ₹30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ముమ్మరంగా ఉన్న కరెంటు కోతలను తక్షణమే నివారించి, సాగునీరు అందక ఎండిపోతున్న వరి పైర్లను కాపాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, సీనియర్ నాయకులు ముస్కు బుచ్చిరెడ్డి, వల్లూరు శ్రీశైలం, బొల్లెపల్లి పుల్లయ్య, చిక్కుల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం: మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు
- అవార్డు గ్రహీతలకు పురస్కారాల అందజేత



**చందూరు, అక్టోబర్ 6 ( వుదయం)**



మండల స్థాయిలో విద్యాబోధనలో విశేష సేవలు అందించి, విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం చందూరులో అత్యంత ఘనంగా జరిగింది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై, ఎంపికైన 11 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్మన్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమాజ వికాసంలో, విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వర్ణనాతీతమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. అనంతరం ఎంఈవో ఊట్కూరు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి గౌరవించడం ద్వారా మిగతా వారికి కూడా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో పనిచేస్తామని హర్షం వ్యక్తం చేశారు.

**అవార్డు గ్రహీతలు వీరే..**

మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్న వారిలో రావిరాల అరుణ (ఎస్ఏ–తెలుగు), ఎస్.కె. మజీద్ (ఎస్ఏ–తెలుగు), అనిల్ కుమార్ (ఎస్ఏ–ఇంగ్లీష్), ఎస్జీటీ ఉపాధ్యాయులు కే. సత్యవతి, ఎన్. అనిత, బి. చైతన్య, కే. శరత్ బాబు, జి. శ్రీనివాసులు, కె. అనిత, ఆర్. చౌకీసింగ్, అలాగే కేజీబీవీ నుంచి ఆరంజ్యోతి ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. యాదగిరి, తుమ్మలపల్లి సర్పంచ్ బోయపల్లి రాజేష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల మండల నాయకులు, ఎంఆర్సీ సిబ్బంది, పలు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి
- సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి
- డ్రగ్స్ ప్రభావానికి గురైన వారికి సమాచారం అందిస్తే తక్షణమే డీ-అడిక్షన్ చికిత్స అందిస్తాం
- ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలో 'మిషన్ పరివర్తన' అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్ రెడ్డితో కలిసి పాల్గొన్న మంత్రి




**పెద్దపల్లి,(ధర్మారం) అక్టోబర్-06 (వుదయం ప్రతినిధి)**

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి యువత ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దని, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మంగళవారం ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమమని అభినందించారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై మరింత అవగాహన కల్పించేలా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావొద్దని సూచించారు. కేవలం సరదా, థ్రిల్ కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించ కూడదని హితవు పలికారు. డ్రగ్స్‌కు బానిసలైతే విలువైన విద్య, కెరీర్‌తో పాటు భవిష్యత్ కూడా దెబ్బతింటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో కూడా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెడతాయని అన్నారు. ఎవరైనా 'ఒక్కసారి ప్రయత్నించు' అని చెప్పినా వారి మాటలను వినవద్దని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి ప్రభావానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మంత్రి తెలిపారు. సమాచారం అందిన వెంటనే వారికి అవసరమైన డీ-అడిక్షన్ చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వైపు వెళ్లకుండా యువతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. 2006లో తాను జడ్పీ సభ్యుడిగా ఎన్నికయ్యానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశీస్సులతో మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం లభించిందని అన్నారు. ప్రజల ఆశీస్సులతో లభించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను ప్రతి ఒక్కరికీ వివరించి, వాటి నిర్మూలనకు అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

డీసీపీ రాంరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత తమ విలువైన సమయాన్ని, భవిష్యత్‌ను డ్రగ్స్ కారణంగా నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. తమ చిన్ననాటి రోజుల్లో సారా వినియోగాన్ని నిర్మూలించేందుకు 'మార్పు' నాటికను రూపొందించి ప్రజల్లో అవగాహన కల్పించామని డీసీపీ రామ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల నిర్మూలన కోసం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చైతన్య సందేశాన్ని అందిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి , జిల్లా కలెక్టర్ , డీసీపీ పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, ప్రజలు కలిసి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, ఏసీపీ కృష్ణ, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, మహిళా సంఘాల సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

---

# నిర్లక్ష్యం చేస్తే.. ఉద్యమం ఉధృతం!

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్పదు
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**వేములవాడ, అక్టోబర్ 7 (వుదయం ప్రతినిధి) :**

వేములవాడ–సిరిసిల్ల ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే ప్రజల పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం వేములవాడకు చేరుకున్న కవిత ముందుగా దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేదపండితులు ఆమెకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం మున్నూరు కాపు మండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని కవిత పేర్కొన్నారు,ఆలయ అభివృద్ధి పనులు ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని కోరారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, భక్తులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు,ఆలయ అభివృద్ధికి కేటాయించిన నిధులు భక్తులు, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా వినియోగించాలని కోరారు.

**డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం**

వేములవాడ పట్టణాన్ని ఏళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారుస్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వేములవాడ–సిరిసిల్ల ప్రాంత రైతులు బోరుబావులపైనే ఆధారపడుతున్నారని కవిత తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసి రైతులకు శాశ్వత సాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. రుద్రంగి చెరువు సమీపంలోని రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రెండు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ప్రజాప్రతినిధులంతా పార్టీలకు అతీతంగా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే సైకిల్ యాత్రలు, పాదయాత్రలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. సిరిసిల్ల–సిద్దిపేట–జనగాం రైల్వే లైన్ ఏర్పాటు ప్రజల చిరకాల డిమాండ్ అని కవిత పేర్కొన్నారు. రవాణా సౌకర్యాల కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వే లైన్ ఏర్పాటుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రజలతో కలిసి రైల్వే లైన్ కోసం ఉద్యమిస్తామని తెలిపారు.గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన తెలంగాణ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రకటించిన పరిహారం బాధిత కుటుంబాలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు. సిరిసిల్ల–వేములవాడ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలని కవిత కోరారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలని, మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజులు, వైద్య ఖర్చులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు, మిడ్‌మానేరు ప్రాజెక్టు కారణంగా మిగిలిపోయిన ముంపు గ్రామాల బాధితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిహారం, పునరావాసం, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల తరఫున ప్రభుత్వంతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.నే రెళ్ల బాధితులకు గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు సుమలత సుధాకర్ శర్మ, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ మజీద్, జిల్లా నాయకులు వరద సతీష్, కుమార్, నూనె మల్లేష్ యాదవ్, పూసల వినయ్, వేములవాడ పట్టణ నాయకులు తోట కనుకయ్య, నాయకులు శైలజ, నవీన్, వినయ్, సురేష్, రమేష్, భాస్కర్, శ్రీనివారెడ్డి, జావీద్, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

# విద్యార్థుల అవసరాలకు అండగా 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్

**తెనుగువాడ ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ బాక్స్ బహూకరణ**



**పెద్దపల్లి, అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి పట్టణంలోని 18వ వార్డు తెనుగువాడ ప్రభుత్వ పాఠశాలకు 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ సౌండ్ బాక్స్‌ను బహూకరించారు. పాఠశాలలో నిర్వహించే ప్రార్థనలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగపడేలా సౌండ్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొలిపాక సంపత్ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు అవసరమైన మరిన్ని సౌకర్యాల కోసం కూడా తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. సౌండ్ బాక్స్‌ను బహూకరించిన కౌన్సిలర్ కొలిపాక సంపత్‌కు ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అవసరాలను గుర్తించి సౌండ్ బాక్స్ అందించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు కూడా కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ కొలిపాక నర్సయ్య, గంగుల సతీష్, భూతగడ్డ తిరుపతి, వేల్పుల రాజేశం, మౌటం శంకర్, ఆశాలు, వేల్పుల సంతోష్, గంగుల సంతోష్, కొలిపాక రాము, కొలిపాక గంగారాజు తదితరులు పాల్గొన్నారు.

---

# ఫొటోగ్రఫీలో మంథని ముద్ర.. జాతీయ స్థాయిలో కోటారి శ్రీనివాస్‌కు డబుల్ ధమాకా

**మంథని, అక్టోబర్ 6: వుదయం ప్రతినిధి**



ఫొటోగ్రఫీ రంగంలో తనదైన ప్రతిభను చాటుకుంటున్న మంథనికి చెందిన ఫొటోగ్రాఫర్ కోటారి శ్రీనివాస్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఫొటోగ్రఫీతో పాటు ఏఐ ఎడిటర్‌గా సేవలందిస్తున్న ఆయనకు రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఫొటో ట్రేడ్ షో సందర్భంగా జాతీయ స్థాయి భారత్ కళా పురస్కార్–2026 వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, ఏఐ ఎడిటర్ పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీనివాస్ బెస్ట్ ఏఐ ఎడిటర్, బెస్ట్ వెడ్డింగ్ వీడియోగ్రఫీ విభాగాల్లో అవార్డులు అందుకున్నారు. ఫొటోగ్రఫీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, నిర్వాహకులు, సినీ నటుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమైన విషయమన్నారు. తన ప్రతిభను గుర్తించి సత్కరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో ప్రోత్సాహం, సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎం.సి. శేఖర్, ట్రేడ్ షో నిర్వాహకులు ఎడిట్ పాయింట్ రమేష్, ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి, తెలంగాణ మాజీ ఫొటోగ్రఫీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పలువురు సినీ నటులు, దేశవ్యాప్తంగా ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

---

# 8న మంథని మున్సిపాలిటీ అఖిల భారత యాదవ సంఘం కమిటీ ఎన్నిక

**మంథని, అక్టోబర్ 6:వుదయం ప్రతినిధి**



అఖిల భారత యాదవ సంఘం మంథని మున్సిపాలిటీ కమిటీ ఎన్నిక ఈ నెల 8న గురువారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు మోహన్ యాదవ్, వేముల లక్ష్మయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని పట్టణంలోని రెడ్డి బాంక్వెట్ హాల్ లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. నూతన మున్సిపల్ కమిటీ ఎన్నికతో పాటు సంఘం బలోపేతంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యాదవ సంఘం కుల బాంధవులు, మంథని పట్టణంలోని యాదవ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్ యాదవులు పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

---

# రాజేశ్వర్ రావుపేటలో రూ. 26 లక్షలతో కల్వర్ట్ నిర్మాణం



- కల్వర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన
- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**

మెట్‌పల్లి మండలం రాజేశ్వరరావుపేట గ్రామంలో 26 లక్షల రూపాయల వ్యయం తో చేపట్టనున్న నూతన కల్వర్ట్ నిర్మాణ పనులకు కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల శంకుస్థాపన చేశారు.

ఇట్టి కల్వర్ట్ నిర్మాణంతో శ్మశాన వాటిక దారికి గ్రామ ప్రజలకు రైతులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

---



# పోషణ మాసంలో అక్షరాభ్యాసం

**పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించిన ఆర్‌బీఎస్‌కే బృందం**

**ముత్తారం అక్టోబర్ 06(వుందయం ప్రతినిధి ):**

పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా ముత్తారం మండలంలోని పోతారం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.అంగన్‌వాడీ టీచర్ శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు విద్యా ప్రాధాన్యతను వివరించి అక్షరాభ్యాసం చేపట్టారు.అనంతరం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తల్లిదండ్రులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో పోతారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సత్తయ్య,ఉపాధ్యాయురాలు వీణ,ఆశా వర్కర్ జ్యోత్స్న,ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు. పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం చిన్నారుల్లో విద్యాభ్యాసంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ఆరోగ్య అవగాహన కల్పించిందని నిర్వాహకులు తెలిపారు.

---

# ఎమ్మెల్యే సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఐ

**జగిత్యాల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల పట్టణ 1ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

---

# టేకు చెట్ల దొంగతనానికి పాల్పడిన నలుగురు అరెస్ట్

**జగిత్యాల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**



ఎండపల్లి మండలం పాత గూడూరు గ్రామానికి చెందిన రైతు పొలంలో రెండు టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి దొంగిలించారన్న ఫిర్యాదుతో వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది ధర్మపురి సీఐ ఎ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెల్గటూర్ శివారులో టేకు దుంగలను తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు నిందితులు అవైజ్ ఖాజీ రహమాన్ అలీ అర్సద్ షౌకత్ అలీలుగా పోలీసులు తెలిపారు మేడిపల్లి జగిత్యాల రూరల్ మల్యాల పోలీస్ స్టేషన్ల పరిధుల్లోనూ టేకు చెట్లను నరికినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు నిందితుల నుంచి 132 టేకు దుంగలు అశోక్ లేలాండ్ ఆటో బైక్ ఎలక్ట్రిక్ రంపం మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

---



# చంద్రయ్యను పరామర్శించిన పుట్ట మధూకర్

**మంథని, అక్టోబర్ 6: వుదయం ప్రతినిధి**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఉచ్ఛ్వాస హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మంథని నియోజక వర్గం కమాన్పూర్ మాజీ ఎంపీపీ తోట చంద్రయ్యను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని పుట్ట మధూకర్ ఆకాంక్షించారు.

---

# మానకొండూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో అంగన్ మిలాన్ కార్యక్రమం

**కరీంనగర్ అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి):**



భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, అలాగే వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా అంగన్ మిలాన్ కార్యక్రమాన్ని మానకొండూర్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మానకొండూర్,గట్టు దుద్దెనపల్లి, వెగురుపల్లి, దేవనపల్లి అంగన్‌వాడీ కేంద్రలలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షురాలు గుర్రాల నిర్మల రెడ్డి మరియుమహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ఆవుదారి విజయ, బీజేపీ మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పండ్లు అందించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు సక్రమంగా అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, బాగోగులపై అంగన్‌వాడీ సిబ్బందితో వివరాలు తెలుసుకుని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వర్కర్లతో మాట్లాడి కేంద్రం నిర్వహణకు సంబంధించిన వివరాలను సేకరించారు.చిన్నారుల ఆరోగ్యం, పోషణ మరియు మహిళల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని బీజేపీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోన్నకుల శ్రీనివాస్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి భాషబోయిన ప్రదీప్ యాదవ్, ఉపాధ్యక్షులు మర్రి అంజనేయులు, మార్కొండ రమేష్ పటేల్, నందగిరి బలరాం, మండల కార్యవర్గ సభ్యులు యాళ్ల రాజగోపాల్ రెడ్డి, గాడిచర్ల భూమయ్య ఆరేపల్లి సునంద్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# యాదవ సంఘం అధ్యక్షుడికి కాంగ్రెస్ నేతల సన్మానం

**ముత్తారం అక్టోబర్ 06(వుందయం ప్రతినిధి):**



ముత్తారం మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చేలుకల జితేందర్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,సర్పంచ్ పేగుడ తిరుమల కుమార్,కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ తాటిపెల్లి రాజన్న,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్‌లు జితేందర్ యాదవ్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ సభ్యుల సంక్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# విధుల్లో చేరిన మండల సమాఖ్య సిబ్బంది

**ముత్తారం అక్టోబర్ 06(వుందాయం ప్రతినిధి):**



ముత్తారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరు రోజులుగా చేపట్టిన నిరవధిక సమ్మెను విరమించి సోమవారం విధుల్లో చేరారు.పెద్దపెల్లి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీఎం స్వరూపరాణి సమక్షంలో సిబ్బంది తిరిగి తమ విధులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు.జిల్లా స్థాయి అధికారుల హామీతో పాటు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.విధుల్లో చేరిన అనంతరం కార్యాలయ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు.సిబ్బంది సంక్షేమం, ఉద్యోగ భద్రత అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల సమాఖ్య సిబ్బంది, కార్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి అరెస్ట్

**కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**




కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్ లో జరిగిన హత్యాయత్నం నేరపూరిత కుట్ర కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఠాకూర్ వినయ్ సింగ్ (31) కోరుట్ల పోలీసులు 6 10 2026 తెల్లవారుజామున అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడించారు వివరాల్లోకి వెళితే పోలీసుల వివరాల ప్రకారం 2024 జూన్ 24న పాత కక్షల నేపథ్యంలో పోగుల రాజేష్ పై నిందితులు పథకం ప్రకారం దాడి చేసి హత్యకు యత్నించినట్లు తెలిపారు ఈ కేసులో ఇప్పటికే ఎ 2 నుంచి ఏ 6 వరకు నిందితులను అరెస్టు చేసి కోర్టు హాజరు పరిచారు కదా ఆప్పటి నుంచి పరారీలో ఉన్న ఏ 1 ఠాకూర్ వినయ్ సింగ్ ను సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణకు అందిన విశ్వసనీయ సమాచార ప్రకారం సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజు తన సిబ్బందితో కలిసి మంగళవారం కోరుట్ల బస్టాండ్ తీసుకున్నారు అనంతరం చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసి వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టు హాజరు పరచగా 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు నేరాలకు పాల్పడి ఎంత కాలం పోరాడిలో ఉన్న చట్టం నుంచి తప్పించుకోలేరని నేర సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

## భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

- రైతులు నిర్వాసితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

జగిత్యాల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)



జిల్లాలో కొనసాగుతున్న అన్ని భూసేకరణ ప్రాజెక్టులపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనుల పురోగతి పరిహారం చెల్లింపులు భూసేకరణకు సంబంధించిన ఫైళ్ల స్థితిగతులను కలెక్టర్ సమీక్షించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులన్నింటినీ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు భూసేకరణ కారణంగా భూములు కోల్పోతున్న రైతులు నిర్వాసితులకు చట్టబద్ధంగా అందాల్సిన పరిహారాన్ని త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను రోజువారీగా పరిశీలిస్తూ పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో వాటిని పరిష్కరించాలని తెలిపారు ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ పనులు ఆటంకంగా మారకుండా నిర్దేశిత కాలవ్యవధిలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు ఆర్డీవోలు ఇరిగేషన్ ఇంజనీర్లు తహశీల్దార్లు ల్యాండ్ అక్విజిషన్ (ఎల్ఏ) యూనిట్ అధికారులు తమ పరిధిలోని భూసేకరణ పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

పెండింగ్ ఫైళ్లను ప్రత్యేకంగా గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంతో పాటు రైతులు నిర్వాసితులకు రావాల్సిన పరిహారం సకాలంలో అందేలా సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు ఈ సమీక్ష లో జిల్లా అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ జగిత్యాల కోరుట్ల మెట్ పెల్లి ఆర్డీవోలు మధుసూదన్ జీవాకర్ రెడ్డి నర్సింహారావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ధర్మారం మండలం కానంపల్లి చెరువు భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పెద్దపల్లి బైపాస్ రోడ్డు రైతులతో చర్చలు జరపాలి
- అభివృద్ధి పనుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని రైతులు సహకరించాలి
- చట్ట ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు
- అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో భూ సేకరణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబర్-06 (వుదయం ప్రతినిధి)



జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో భూ సేకరణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధర్మారం మండలం కానంపల్లి చెరువుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించి ఇంకా పరిష్కరించాల్సిన అంశాలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు నిర్వహించాలని సూచించారు. రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుని, వారికి అవసరమైన వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం జిల్లా అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యం దృష్ట్యా ఎంతో అవసరమైనదని తెలిపారు. అభివృద్ధి పనుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని రైతులు సహకరించాలని కోరారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు చట్టం, నిబంధనల ప్రకారం అందాల్సిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులతో చర్చలు జరిపి, వారి సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించడంతో పాటు, చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. భూ సేకరణకు సంబంధించిన రికార్డులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలను శాఖల వారీగా సమీక్షిస్తూ నిర్ణీత సమయంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ బి. గంగయ్య, తహసిల్దార్ రాజయ్య, అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల 132 కేవీ సబ్ స్టేషన్ విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించిన నోడల్ అధికారి కె వెంకట రమణ

- 132 కేవీ పోచంపాడ్ రింగ్ క్లోజ్‌తో విద్యుత్ సరఫరాకు మరింత బలోపేతం
- విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు
- టీజీ ఎన్‌పీడీసీఎల్ నోడల్ అధికారి సీ ఈ ఐపీసీ అండ్ ఆర్ఏసీ కె వెంకట రమణ



కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల 132 కేవీ సబ్ స్టేషన్ విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించిన నోడల్ అధికారి కె వెంకట రమణ 132 కేవీ పోచంపాడ్ రింగ్ క్లోజ్‌తో విద్యుత్ సరఫరాకు మరింత బలోపేతం చేసి వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నట్లు టీజీ ఎన్‌పీడీసీఎల్ నోడల్ అధికారి సీ ఈ ఐపీసీ అండ్ ఆర్ఏసీ కె వెంకట రమణ తెలిపారు మంగళవారం కోరుట్ల పట్టణ 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి విద్యుత్ సరఫరా పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ లోడ్లు పరికరాల పనితీరు సరఫరా స్థిరత్వం తదితర అంశాలను సమీక్షించారు అనంతరం 132 కేవీ పోచంపాడ్ రింగ్‌ను విజయవంతంగా క్లోజ్ చేయడాన్ని పరిశీలించారు 132 కేవీ రింగ్ క్లోజ్ కావడం తో కోరుట్ల పరిధిలో విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా మారడం ప్రత్యామ్నాయ సరఫరా అందుబాటులోకి రానుందన్నారు పెరుగు తున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు ట్రాన్స్‌మిషన్ లైన్లు విద్యుత్ మౌలిక వసతుల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలని నోడల్ అధికారి అధికారుల కు సూచించారు

సాంకేతిక లోపాలు తలెత్తిన స్పందించి విద్యుత్ సరఫరా త్వరితగ తిన పునరుద్ధరించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపరచడంతో పాటు వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు చేపడుతు న్న పనులను వేగవంతం చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి డీఈ మధుసూదన్ ఏడీఇ ఆడెపు భూమేశ్వర్ కోరుట్ల ఏఇ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అరుదైన మోకాలి సమస్యకు చికిత్స

పెద్దపల్లి, అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)



లక్షలో ఒకరికి మాత్రమే కనిపించే అరుదైన మోకాలి సమస్యకు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతమైన చికిత్స. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీనగర్‌కు చెందిన గీతకు జన్మించిన శిశువులో పుట్టుకతో వచ్చే అరుదైన మోకాలి సమస్యను పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి వైద్యులు గుర్తించారు.వైద్య పరిభాషలో ఈ సమస్యను "కంజెనిటల్ నీ డిస్లోకేషన్ (Genu Recurvatum Congenitum)" అని పిలుస్తారు. అంటే, శిశువు పుట్టుకతోనే మోకాలు సాధారణ దిశకు విరుద్ధంగా వెనక్కి వంగి ఉండే పరిస్థితి. ఇది సుమారు లక్ష మందిలో ఒకరికి మాత్రమే కనిపించే అరుదైన సమస్య. శిశువు జన్మించిన వెంటనే సమస్యను గుర్తించిన పిల్లల వైద్యులు, ఎముకలు–కీళ్ల వైద్యులను సంప్రదించారు. ఇరు విభాగాల వైద్యులు శిశువును పరీక్షించి, అవసరమైన చికిత్సను ప్రారంభించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో, పిల్లల వైద్య విభాగం, ఎముకలు–కీళ్ల వైద్య విభాగం సమన్వయంతో శిశువుకు పెద్దపల్లి జిల్లా ఆ సుప త్రిలోనే విజ య వ ం తంగా చికిత్స అందించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇలాంటి పుట్టుకతో వచ్చే సమస్యలను వీలైనంత త్వరగా గుర్తించి, సరైన చికిత్స అందించడం ఎంతో ముఖ్యమని వైద్యులు తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో మోకాలి కదలికలు, నడకలో ఇబ్బందులు తలెత్తకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. అరుదైన సమస్యను సకాలంలో గుర్తించి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ మార్గదర్శకత్వంలో రెండు వైద్య విభాగాలు సమన్వయంతో జిల్లా ఆసుపత్రి లోనే చికిత్స అందించడం విశేషం.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

- పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం
- రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి
- రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ శక్తులపై నిరంతర నిఘా ఉంచాలి

కరీంనగర్ అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి):



కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో కమీషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని డివిజన్ల ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతో సమగ్ర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల పరిష్కార (డిస్పోజల్) వివరాలను క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ జారీ చేసిన కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. రెండేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉండి, నిందితులు పట్టుబడని కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాత కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచాలి. సకాలంలో చార్జ్ షీట్లు నమోదు కేసు స్వభావాన్ని బట్టి నిర్దేశిత చట్టబద్ధమైన గడువు (60 లేదా 90 రోజుల్లోగా) లో సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలి. దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు.

రౌడీ షీటర్లపై కఠిన నిఘా

కమీషనరేట్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన ప్రివెంటివ్ డిటెన్షన్ చర్యలు చేపట్టాలి. స్టేషన్ల వారీగా డిస్పోజల్ లక్ష్యాలు పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కార్యాచరణ రూపొందించుకోవాలి. బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు వేగవంతం చేయాలి. రానున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించాలి. ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ బందోబస్తు నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో కమీషనరేట్ అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, మాధవి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## పౌష్టికాహారమే బలమైన పునాది

- ఐదేళ్లలోపు చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ,అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి) :



నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది అని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. పట్టణంలోని 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన 9వ మాస పోషణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తూమ్ మధుతో కలిసి చిన్నారులకు స్వయంగా అన్నప్రాసన చేశారు. చిన్నారులు పోషకాహార లోపానికి గురికాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని ఉచితంగా అందిస్తోందని పుల్కం రాజు తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ దశ ఎంతో కీలకమని పేర్కొన్నారు. పిల్లలకు సమతుల్య ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.హ,గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని చైర్మన్ సూచించారు. పౌష్టికాహారం, రక్తహీనత నివారణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి చేర్పించేలా ఇంటింటా ప్రచారం నిర్వహించి పిల్లల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్ తూమ్ మధు, వార్డు అధికారి పర్శరామ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్, ఆశా కార్యకర్తలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆలయానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి

మంత్రి సానుకూల స్పందన

ధర్మపురి అక్టోబర్06(వు దయం ప్రతినిధి):



మండలంలోని తీగల ధర్మారంలోని పురాతన శ్రీ దుర్గామాత ఆలయానికి కమ్యూనిటీ హాల్ తోపాటు రేకుల షెడ్డు మంజూ రు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ ప్రతి నిధులు కోరారు.మంత్రికి వినతిపత్రం అందజే శారు.ధర్మపురి మండలంలో పురాతనమైన,ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన ఆలయంగా శ్రీ దుర్గా మాత ఆలయం ఉందని వారు మంత్రికి వివరించారు.ఆలయా నికి వచ్చే భక్తులు,గ్రామస్థుల అవసరాలను దృష్టిలో ఉంచు కుని కమ్యూనిటీ హాల్, రేకుల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిం చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిరి అశోక్,మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్,పందిరి తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్ జంగిలి రవీందర్,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## లయన్ ఎంఏ రవూఫ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం...

కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)



కొరుట్ల పట్టణ జూనియర్ కాలేజ్ లో లయన్ ఎంఏ రవూఫ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్ఓ అండ్ యువి వాటర్ ఫిల్టర్ ను విరాళంగా అందజేశారు ఈసందర్భంగా ఓంకార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ఆర్ఓ అండ్ యువి వాటర్ ఫిల్టర్‌ను అందించడం పట్ల పాఠశాల యాజమాన్యం సిబ్బంది విద్యార్థులు లయన్ ఎంఏ రవూఫ్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షులు లయన్ గుంటుక మహేశ్ కార్యదర్శి లయన్ బెజ్జంకి శ్రీనివాస్ రావు కోశాధికారి లయన్ పోలాస రవీందర్ పిఆర్ఓ లయన్ పొతాని ప్రవీణ్ లయన్ పడాల నారాయణ గౌడ్ లయన్ ఏలేటి లక్ష్మారెడ్డి లయన్ నల్ల గంగాధర్ లయన్ చెన్న శ్రీనివాస్ కుమార్ లయన్ దొనే రాజేశ్వర్ లయన్ కుడెల రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ద్వాదశ దినకర్మలో జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత తండ్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మామ మాదాపూర్ గ్రామానికి చెందిన కుంట లచ్చయ్య ఇటీవల మృతిచెందగా మంగళవారం మృతుడి స్వగ్రామంలో నిర్వహించిన ద్వాదశదినకర్మలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని లచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు ఈ ద్వాదశదినకర్మలో కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ లచ్చయ్య చేపూరి కృష్ణారెడ్డి మరిపెల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ముమ్మరంగా పారిశుధ్య చర్యలు

సీజనల్ వ్యాధుల నివారణకు మున్సిపాలిటీ ముందస్తు ఏర్పాట్లు

ధర్మపురి,అక్టోబర్06 (వుదయం ప్రతినిధి):



ధర్మపురి పట్టణంలో ప్రస్తుతం విస్తరిస్తున్న సీజనల్ విషజ్వ రాలను దృష్టిలో ఉంచుకుని, వాటి నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పకడ్బందీ ముంద స్తు చర్యలు చేపట్టినట్లు మున్సి పల్ చైర్మన్ వేముల.నాగలక్ష్మి తెలిపారు.పట్టణ ప్రజలను సీజ నల్ వ్యాధుల బారి నుంచి రక్షిం చేందుకు చైర్మన్,మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక ఆదేశా లు జారీ చేశారు.మున్సిపల్ సిబ్బం ది పట్టణంలోని పలు వార్డుల్లో దోమల నివారణ చర్యలను ముమ్మరం చేశారు. ప్రధానంగా దోమల వృద్ధిని అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు,దోమల నివారణ మందుల ను స్ప్రే చేస్తున్నారు.అలాగే, వర్షపు నీరు లేదా వ్యర్థ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం,మురికివాడలు మరియు తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ విస్తృతంగా పారిశుధ్య పనులు చేపడుతు న్నారు. అనారోగ్యా ల నియంత్రణకు మున్సిపల్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ,మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్య క్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్.గంగాధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొ న్నారు.



## తల్లిని ఇంట్లోంచి గెంటేసిన కొడుకు

టాస్క్ ద్వారా ఆర్డీవోకు ఫిర్యాదు

జగిత్యాల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం లక్ష్మి పూర్ చెందిన బాదే బుచ్చమ్మ (85) అనే అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ తల్లిని కన్నకొడుకు రాజేందర్ నిరాదరిస్తూ పోషణ వైద్య ఖర్చులు పెట్టక గెంటివేయగా జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది కాగా మంగళవారం సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులతో వెళ్లి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు అనంతరం ఆ వృద్ధ తల్లి సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో తన గోడు విలేకరులకు వినిపించారు తన కొడుకు తన మరణించిన భర్త హన్మంత్ కట్టిన ఇల్లును మరో 3 గుంటల భూమిని తన పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకొన్నప్పటికీ తనను నిరాదరిస్తూ పోషణ వైద్య ఖర్చులు పెట్టక ఇంట్లోంచి వెళ్లగొట్టి ఎక్కడైనా చావుపో అంటే తన కూతురు వద్ద ఉంటున్నానని రోధించింది తన ఇంటిలో తనను ఉంచి అనారోగ్యం తో ఉన్న ముసలి వయస్సు లో సేవలు చేయడానికి ఒక అడ పని మనిషిని పెట్టించి కన్న కొడుకు నుంచి వైద్య పోషణ ఖర్చుల కోసం ప్రతి నెల 20 వేల రూపాయలు ఇప్పించాలని సీనియర్ సిటిజన్స్ సంఘాన్ని ఆశ్రయించి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా కొడుకు పై కేసు నమోదు చేశారని ఎస్పీకి సైతం ఫిర్యాదు చేస్తానని ఆ వృద్ధ తల్లి విలేకరుల ముందు ఏడుస్తూ చెప్పింది ఆ వృద్ధ తల్లి వెంట ఆమె కూతురు జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం కాన్సిలియేషన్ అధికారి పి హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం

- డిసిసి మైనారిటీ అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం
- ఇతర కమిటీలకు నియామక పత్రాల అందజేత
- సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నేతలకు పిలుపు
- పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్

కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణ జిఎస్ గార్డెన్స్ లో బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా మైనార్టీ అధ్యక్షుని ప్రమాణ స్వీకారం వివిధ కమిటీల నియామక పత్రాలు అందజేసే కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో చేపట్టారు ఉదయం 10 గంటలకు సాయిబాబా గుడి సమీపంలోని డి 40 కెనాల్ నుండి ఊరేగింపు ప్రారంభమవుతుందని నేడు జరగనున్న ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మానాల మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు హాజరయ్యే ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన ఎంఏ నయీమ్ బాధ్యతల స్వీకరణ తో పాటు ఇటీవల నియామకమైన కమిటీలకు నియామక పత్రాలను అందజేస్తారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ తెలిపారు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు హాజరై సమావేశాన్ని దిగ్విజయం చేయవలసిందిగా కోరారు.

## ఒక్క అర్హుడి ఓటూ పోకూడదు

- ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి
- 87.68 శాతం డిజిటలైజేషన్ పూర్తి.. హెల్ప్‌డెస్కులు, పోలింగ్ కేంద్రాల పరిశీలన
- రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకురాలు బాలమయాదేవి



రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 06 (వుదయం ప్రతినిధి) :

అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకురాలు, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాలమయాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ 87.68 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఫారం-6, 7, 8 కింద మొత్తం 65,716 దరఖాస్తులు అందగా.. 61,475 దరఖాస్తులను పరిష్కరించినట్లు వివరించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని బాలమయాదేవి అన్నారు. ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు అర్హులైన ఒక్క ఓటరూ జాబితా నుంచి తొలగిపోకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మిగిలిన ధ్రువపత్రాల పరిశీలనను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్లకు కారణాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్‌పై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు ప్రాధాన్యంపై స్వీప్ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

ఏఎస్‌డీడీ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థంగా కొనసాగుతోందని సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె.. అధికారులు, కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు.సమీక్ష అనంతరం బాలమయాదేవి, అదనపు కలెక్టర్‌తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. ఫిర్యాదుల నమోదు, పరిష్కారంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 121, 133 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్ఓల నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను తెలుసుకున్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కె.ఎస్.బీ.కుమారి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఏఈఆర్ఓలు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల ద్వారా నాణ్యమైన వరి విత్తనోత్పత్తి



ధర్మపురి,అక్టోబర్ 6(వుదయం ప్రతినిధి):

సుస్థిర వ్యవసాయాభివృద్ధి కోసం నాబార్డు, వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తి ని ప్రోత్సహిస్తున్నట్లు రైతు విజ్ఞా న కేంద్రం సమన్వయకర్త డాక్టర్ తిరుపతి తెలిపారు. మంగళ వారం జైన రైతు వేదికలో వరి విత్తనోత్పత్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నిపుణులు కీలక సూచనలు చేశారు. రైతులు ధ్రువీకరించిన మూల విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని, పొలంలో ఇతర రకాలు కలవకుండా తగిన దూరం పాటించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పుష్పించే దశలో భిన్న మొక్కలను ఏరివేసి జన్యు స్వచ్ఛత కాపాడుకోవాలన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి సూచించారు. కోత తర్వాత విత్తనాలను తేమ లేకుండా ఆరబెట్టి సురక్షితంగా నిల్వ చేయాలన్నారు.ఈ పద్ధ తుల ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమా ర్ పేర్కొన్నారు.రానున్న యాసం గిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరా రు.ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి మంజుల,రైతులు, సౌళ్ల.భీమ య్య భీమయ్య, మధు కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కోరుట్లలో రవాణా శాఖ యూనిట్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక తనిఖీ



ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి

కోరుట్ల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో గల రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు కార్యాలయంలోని రికార్డులు ఆర్థిక లావాదేవీలు చలాన్లు పెండింగ్ దరఖాస్తులు కార్యాలయ పని తీరును అధికారులు పరిశీలించారు. తనిఖీల్లో పలు లోపాలను ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలిపారు ఎంవీఐ పర్యవేక్షణ లేకుండా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు సిబ్బంది అధికారిక సేవల సమయంలో ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు ఏజెంట్లు రవాణా శాఖ కార్యాలయంలో స్వేచ్ఛగా తిరుగుతూ సిబ్బందితో వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు కార్యాలయ రికార్డులు రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదని పేర్కొన్నారు సిబ్బంది విధుల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడాన్ని గుర్తించారు డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తున్న ప్రదేశం రవాణా శాఖ ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేల్చారు డ్రైవింగ్ ట్రాక్‌లో అవసరమైన సైన్ బోర్డులు కూడా లేవని అధికారులు గుర్తించారు ఈ లోపాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యల కోసం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏసీపీ డిఎస్పి మహేందర్ రెడ్డి సిఐ లు తిరుపతి ప్రేమ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

వుదయం



# రహదారి దుస్థితిపై అధికారుల నిర్లక్ష్యం తగదు



* ప్రధాన రహదారిపై నరకప్రాయంగా ప్రయాణం
* తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన బాట!
* తెలంగాణ రక్షణ సేన పార్టీ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు ఇంద్ర గౌడ్

గజ్వేల్, అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామం వద్ద ప్రజ్ఞాపూర్ భువనగిరి ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు సిలివేరి ఇంద్ర గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం వేలాది వాహనాలు, భారీ రవాణా వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డు ఇరువైపులా వచ్చిపోయే వాహనదారులకు, ప్యాసింజర్లకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతల కారణంగా వరుస ప్రమాదాలు జరుగుతూ అనేకమంది గాయాలపాలవుతున్నారని, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందన్నారు. గతంలో దీనిపై పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజా రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అధికారులు మరియూ ప్రజాప్రతినిధులు స్పందించి యుద్ధప్రాతిపదికన శ్రీగిరిపల్లి పరిధిలోని రహదారికి మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ సీనియర్ నాయకులు కనకచారి, మార్కుక్ మండల నాయకులు గద్దల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి: ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్

దిశ కమిటీ సమావేశంలో యు శాఖల వారీగా పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామంలో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పైలెట్ గా చేపట్టి అమలు చేయాలి

అమృత్ పథకం పనులు మున్సిపాలిటీ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, విద్య, మార్కెటింగ్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్, క్రీడలు, యువజన సర్వీసులు తదితర శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని శాఖల వారీగా సమీక్షించారు. పథకాల అమలు, పనుల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో నగర మేయర్ జి.మమత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్ట్ గా చేపట్టి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో

పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పథకం ద్వారా ఇంటి పైకప్పులపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని టీజీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు సూచించారు. సర్పంచ్‌లు ముందుకు వచ్చే గ్రామాల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

అమృత్ పథకం పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

మున్సిపాలిటీల్లో అమృత్ పథకం ద్వారా చేపడుతున్న తాగునీటి సరఫరా పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. సంబంధిత ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

రైతులు, మహిళా సంఘాలకు డ్రోన్ల ద్వారా పంటలకు పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వైవిధ్యమైన పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

కెజిబివిల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (KGBV) విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీ సూచించారు. ఫుడ్ పాయిజన్ వంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

మిడ్జిల్ KGBVలో వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయడంతో పాటు నూతన డైనింగ్ హాల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.

పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

పీఎం శ్రీ పథకం కింద జిల్లాలోని 26 పాఠశాలల్లో ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ విద్యతో పాటు 8వ తరగతి నుంచే ఐఐటీ, మెడిసిన్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

టీడీ గుట్ట ఆర్ఓబీ భూసేకరణపై చర్చ

టీడీ గుట్ట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అంశాలపై సమావేశంలో చర్చించారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని రైల్వే అధికారులకు ఎంపీ సూచించారు. జిల్లాలో జరుగుతున్న రైల్వే ఆర్.ఓ.బి పనులు, నేషనల్ హై వే రోడ్డు పనులు

సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆర్&బి, పంచాయతీ రాజ్ శాఖా ద్వారా చేపట్టిన రహదారుల పనులు కూడా సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు.

**KGBVలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం:**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పందిస్తూ జిల్లాలోని ప్రతి KGBVని మండల ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఎం.పి.మాట్లాడుతూ

సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భూమి కేటాయించేలా తహశీల్దార్ల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వి.బి.జి. రామ్ జీ నిధులతో అంగన్వాడీ భవనాలు, వి.ఓ భవనాలు, జి.పి.భవనాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు

నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో డీఆర్‌డీఓ నర్సింహులు, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి సీపీఐ, సీపీఎం డిమాండ్

నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబరు 6 (వుదయం ప్రతినిధి):

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఈసీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా సీనియర్ కార్యవర్గ సభ్యుడు ఆర్.శీను అధ్యక్షతన జరిగిన ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎండీ ఫయాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.పర్వతాలు మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి అరెస్టు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ, పశ్చిమబెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను రద్దు చేయాలని, తొలగించారని ఆరోపిస్తున్న 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని కోరారు. వివాదాస్పద ఫామ్ 6ను సవరించాలని, ఎన్నికల సంఘం నియామక నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు, మహిళా జర్నలిస్టులపై పోలీసు నిర్బంధాన్ని ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులు గౌడ్, సీపీఎం జిల్లా నాయకురాలు గీత, నాయకులు మారేడు శివశంకర్, తుమ్మల బీజ్జా, శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు టి.మల్లేష్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రేమ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మధుగౌడ్ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



నంగునూరు, అక్టోబర్ 6: వుదయం

నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామానికి చెందిన బుద్ధి అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీ హరీశ్ రావు గారి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అయిలయ్య కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన ఆదేశాల మేరకు నాయకులు మృతుడి కుటుంబ సభ్యులు, కుమారులు బుద్ధి చంద్రం, వెంకటేశంలను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్ల సోమిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఇంగే నరేశ్, ఉపసర్పంచ్ తిప్పని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ రేణుక వేణుగోపాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రబాబు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళారపు తిరుపతి, కారు శ్రీనివాస్, జయ రాములు, కృష్ణమూర్తి, మాధవరెడ్డి, పరశు రాములు, వెంకటేశం, వార్డు సభ్యులు లోకటి సత్తయ్య, కర్రె సంపతి, నోముల రవీందర్, రంగు చింటూ, బన్నీ, గొల్ల సంఘం సభ్యులు బుద్ధి కొమురెల్లి, శ్రీను, పోశయ్య, నర్సింలు, రవీందర్ తదితరులు పాల్గొని మృతుడి కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.

# తైక్వాండోలో గద్వాల తడాఖా!

జాతీయ వేదికపై జిల్లా క్రీడాకారుల జయకేతనం

బంగారు.. వెండి.. కాంస్యాలతో పతకాల మోత

గద్వాల, అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)

తైక్వాండో జాతీయ వేదికపై జోగులాంబ గద్వాల జిల్లా క్రీడాకారులు తమదైన ముద్ర వేశారు. ప్రత్యర్థులకు దీటుగా పోరాడి.. అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించి.. పతకాలతో సత్తా చాటారు. బంగారు, వెండి, కాంస్య పతకాలను కొల్లగొట్టి జిల్లా క్రీడా ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటారు. గద్వాల క్రీడాకారుల విజయంతో తల్లిదండ్రులు, కోచ్‌లు, క్రీడాభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో సబ్‌జూనియర్, జూనియర్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన గద్వాల ప్రాంత క్రీడాకారులు పూమ్సే, క్యోరగి విభాగాల్లో తమ ప్రతిభకు పదును పెట్టి అద్భుత ఫలితాలు సాధించారు. పూమ్సేలో బంగారు దండకం పూమ్సే వ్యక్తిగత విభాగంలో సహస్ర ప్రతిభ కనబరిచి వెండి పతకాన్ని సాధించింది. జంట విభాగంలో బన్వేష్, వేదాంశి అద్భుత సమన్వయంతో పోటీపడి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.

గ్రూప్ విభాగంలో అక్షయ, రిషిక, తన్వి, సుప్రీతి, అబ్దుల్ రజాక్ సమష్టి ప్రదర్శనతో అదరగొట్టారు. ప్రత్యర్థులను వెనక్కినెట్టి బంగారు పతకాలను సాధించి గద్వాల సత్తాను చాటారు. క్యోరగిలోనూ తగ్గని జోరు పూమ్సేకే పరిమితం కాకుండా క్యోరగి విభాగంలోనూ క్రీడాకారులు పతకాల వేట కొనసాగించారు. భార్గవ్ కాంస్య పతకం సాధించగా, ఎస్.వాగ్దేవ్ రెడ్డి, టి.సమర్థ వాశిష్ట రెడ్డిలు సైతం కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో [illegible]రిన ఈ పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించడం ద్వారా గద్వాల క్రీడాకారులు తమ ప్రతిభను మరోసారి నిరూపించారు. సాధనకు దక్కిన గుర్తింపు ఈ విజయాల వెనుక క్రీడాకారుల క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఉన్నాయని కోచ్‌లు పేర్కొన్నారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని కఠిన పోటీలను ఎదుర్కొని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ కే. శ్రీహరి, జాతీయ రిఫరీ మల్లికార్జున్ గౌడ్, టీ.ఎం.మౌనిక, కోచ్‌లు హరికృష్ణ, శివకృష్ణ, తరుణ్ కుమార్, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అభినందించారు. గద్వాల గడ్డపై మొదలైన సాధన.. జాతీయ వేదికపై పతకాలుగా మెరవడంతో జిల్లా క్రీడా రంగంలో కొత్త ఉత్సాహం నెలకొంది.






అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు భద్రత కల్పించాలి

- పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి

# ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడాలి

నంగునూరు, అక్టోబర్ 6: వుదయం

ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడేలా నిర్ణయాలు ఉండాలని పీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతం పాటించాలని చెప్పారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహార శైలిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియతో పాటు ఓటర్ల జాబితాల్లో మార్పులు, తొలగింపులు, ఎన్నికల సంఘం నిర్ణయాల విధానంపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో యాదగిరి ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఓటర్ల హక్కులను కాపాడాలి**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని యాదగిరి అన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా సరైన ప్రక్రియ లేకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించ వద్దని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియలో పేర్ల తొలగింపు లేదా మార్పులపై అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత ఓటర్లకు సమాచారం అందించాలని అన్నారు. తమ అభ్యంతరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, పౌరులకు మరింత విస్తృతంగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

**నిర్ణయాలపై స్పష్టత ఇవ్వాలి**

ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకునే విధానంపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో, సంస్థ నిర్ణయ ప్రక్రియపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని యాదగిరి పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు రాజ్యాంగబద్ధమైన విధానాలకు అనుగుణంగా, అందరికీ సమానంగా వర్తించే విధంగా ఉండాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఎలాంటి అనుమానాలు తలెత్తకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు మొత్తం ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు.

**రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలి**

ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా కాకుండా రాజ్యాంగం, ఎన్నికల చట్టాలు, ఓటర్ల హక్కులను ప్రాతిపదికగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని దేవులపల్లి యాదగిరి అన్నారు. జ్ఞానేశ్ కుమార్ వ్యవహార శైలిపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియలో తొలగించినట్లు పేర్కొంటున్న ఓట్లను పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు యాదగిరి తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు, అభ్యంతరాలపై ఎన్నికల సంఘం సమగ్రంగా స్పందించి ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని కోరారు.

**ప్రజాస్వామ్యంపై విశ్వాసమే ముఖ్యం**

"ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయనే విశ్వాసం ప్రతి పౌరుడిలో ఉండాలి. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలి. ఎన్నికల సంఘం తన నిర్ణయాల్లో పారదర్శకతను పాటించి ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలి" అని దేవులపల్లి యాదగిరి అన్నారు. ఎన్నికల సంఘంపై వస్తున్న విమర్శలు, సర్ పై రాజకీయ పార్టీల అభ్యంతరాల నేపథ్యంలో ప్రజలకు పూర్తి సమాచారం అందించడం, నిర్ణయాల ప్రక్రియపై స్పష్టత ఇవ్వడం, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు భద్రత కల్పించడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చిన సత్తయ్య, మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, మాజీ ఉప సర్పంచ్ పాలెపు నర్సింలు గౌడ్, బస్వరాజు రాములు, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు మ్యాక రజినీకాంత్, ఐలేని యాదగిరి గౌడ్, తిరుపతి, ఏజాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు వాహనాల కండిషన్ పై ఎస్పీ ఆరా డ్రైవర్లకు వైద్య పరీక్షలు తప్పనిసరి



నాగర్ కర్నూల్, అక్టోబరు 6 (వుదయం బ్యూరో):

నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఇన్నోవా వాహనాలను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ ఐపీఎస్ తనిఖీ చేశారు. వాహనాల కండిషన్, నిర్వహణపై డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. వాహనాల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. వాహనాలను అప్రమత్తంగా, జాగ్రత్తగా నడపాలని, ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా చూడాలని డ్రైవర్లకు సూచనలు చేశారు. ప్రతి డ్రైవర్‌కు నెలకోసారి వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంటీవో ఆర్ఐ రాఘవరావును ఆదేశించారు. అనారోగ్య సమస్యలు ఉన్న డ్రైవర్లను తప్పించి, కొత్త డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి నియమించాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంటీవో ఆర్ఐ రాఘవరావు, అడ్మిన్ ఆర్ఐ జగన్, ఎస్బీ ఎస్ఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, వాహనాల మెకానిక్, జిల్లాలోని వివిధ స్టేషన్ల డ్రైవర్లు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వార్డు సభ్యుడికి ఆర్థిక సాయం



మానవత్వంతో ముందుకొచ్చిన వంగ రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రకాశ్ రెడ్డి

నంగునూరు, అక్టోబర్ 6: వుదయం

నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు బత్తుల కనకయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ నాయకులు ఈ విషయాన్ని వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి, కనకయ్య కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయాన్ని పంపించారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ఈ సాయం కొంత ఊరటనిచ్చింది. గ్రామ మాజీ ఉపసర్పంచ్ అనుముడు ప్రకాశ్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి తన వంతుగా రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన వంగ రాజేశ్వర్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డిలకు బత్తుల కనకయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్లమల్యాల మాజీ సర్పంచ్ తిప్పని రమేశ్, మాజీ ఎంపీటీసీ ఓజల్, సంతోష్ నగర్ సర్పంచ్ సరోజినీ నాయక్, రంగు వెంకన్న, మంతూరి మల్లేశం, దండ్ల మల్లేశం, అమరేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో అండగా నిలవడమే నిజమైన మానవత్వమని పలువురు పేర్కొన్నారు.

# మత్స్యకారుల సంఘ సభ్యులకు వాహనాలను పంపిణీ చేసిన ఎం.పి.డి.కె అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా





మహబూబ్‌నగర్

జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల సంఘాల సభ్యులకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు ఎం.పి.డి.కె అరుణ అరుణ తో కలిసి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వాహనాలను పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఒక ఫోర్ వీలర్ వ్యాన్, ఒక త్రీ వీలర్ ఆటోను మత్స్య సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.పి.డి. కె అరుణ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వాహనాలను సద్వినియోగం చేసుకొని మత్స్య వృత్తిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వాహనాల ద్వారా చేపల రవాణా, విక్రయాలను మరింత సులభతరం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆమె తెలిపారు.

కార్యక్రమంలో డి.ఆర్. డి.ఓ నర్సింహులు, జిల్లా మత్స్య శాఖ అధికారి డి. రాధ రోహిణి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, మత్స్యకారుల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి పండుగ వేళ బాణాసంచా దుకాణాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి: సిద్దిపేట సిపి రష్మి పెరుమాళ్

* అనుమతి లేకుండా అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
* అక్టోబర్ 20వ తేదీలోపు దరఖాస్తులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలి
* అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి

సిద్దిపేట, అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)

రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పండుగ సందర్భంగా జిల్లాలో తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి ముందస్తు అనుమతి, లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. ఈ దరఖాస్తు ఫారమ్‌లను అక్టోబర్ 20వ తేదీలోపు సీపీ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని, దుకాణం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. వ్యాపారులు నిర్దేశిత అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రాథమిక అగ్నిమాపక పరికరాలను దుకాణాల వద్ద అందుబాటులో ఉంచాలని



ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా ఏర్పాటు చేసే అనధికార బాణాసంచా దుకాణాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సీపీ, ప్రమాదాల నివారణకు ప్రజలు, వ్యాపారులు, వేడుకల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# నిరుద్యోగ కళాకారుల రిలే దీక్ష

సాంస్కృతిక సారథిలో అవకాశం కల్పించాలి

- ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ డిమాండ్

వుదయం, సిద్దిపేట ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రజా గొంతుకలై పాటలు పాడి ఉద్యమానికి ఊపుతెచ్చిన కళాకారులు నేటికీ దుర్భర జీవితం గడుపుతున్నారని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి దాసు, జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిరుద్యోగ కళాకారులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. తమ పాటలు, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కాకుండా ఉద్యమాన్ని గ్రామగ్రామాన విస్తరించడంలో కళాకారుల సేవలు మరువలేనివని అన్నారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన కళాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చి, సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యమంలో కీలకంగా పనిచేసిన కళాకారులను ఆదుకోవడంతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఉద్యోగాలు ప్రకటించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, భుజంగం, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకమిటి సభ్యులు కుంచం శ్రీనివాస్, పిల్లిట్ల భుజంగం, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ చిన్నగుండవెల్లి, ఉపాధ్యక్షులు తునికి రాజు, పాకాల భూపతి, గౌరవ అధ్యక్షులు శ్యామ్ సుందర్, ప్రచార కమిటీ సభ్యులు రాజు చిన్నగుండవెల్లి, కోశాధికారి రాజు కందకట్ల, సలహాదారులు శశిధర్, బోడ భాగ్య రేణుక గజ్జెల సీరియల్ ప్రవీణ్ లక్షణ్ సూర్య వంశీ తదితర నిరుద్యోగ కళాకారులూ పాల్గొన్నారు



# అచ్చంపేట ట్రెజరీలో లంచం

**ఏసీబీ వలలో సీనియర్ అకౌంటెంట్**



**అచ్చంపేట, అక్టోబరు 6 (వుదయం ప్రతినిధి):**

అచ్చంపేట ఉప విభాగ ఖజానా (ట్రెజరీ) కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న కందాద వెంకటయ్య ఏసీబీ వలలో చిక్కాడు. మెడికల్ లీవ్ లో వెళ్లి తిరిగి విధుల్లో చేరిన ఓ ఉద్యోగి బిల్లులు, భత్యాల ప్రక్రియ పూర్తి చేసేందుకు రూ.25 వేల లంచం డిమాండ్ చేసి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. ఫిర్యాదుదారుడు ఆగస్టు 14న రూ.3 వేలు నగదుగా, మిగిలిన రూ.22 వేలు ఆగస్టు 18న ఫోన్ పే ద్వారా చెల్లించాడని, దీనిపై కేసు నమోదు చేసి మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని కార్యాలయంలో తనిఖీ చేశామని పేర్కొన్నారు.నిందితుడిని హైదరాబాద్ లోని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదుదారుని వివరాలు గోప్యంగా ఉంచామన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064కు, వాట్సాప్ 9440446106కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచించింది.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి**

**కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు....**

**మెదక్ జిల్లా శివంపేట**

మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన నాలుగు రోజుల క్రితం మరణించిన రెండు కుటుంబాలను వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి
దాసరి అంజయ్య కుటుంబానికి రూ. 5000, ఈరన్ సాయమ్మ కుటుంబానికి రూ. 5000 చొప్పున మొత్తం రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల ఆలయ కమిటీ చైర్మన్ పెద్దపల్లి ఆంజనేయులు మాజీ చైర్మన్ పిల్లి శివకుమార్ వార్డు సభ్యులు బుచ్చి బాలేష్ యిరన్ రాజు గుర్రాల శంకర్, మొనేగారి సత్తయ్య కర్రే సాయిలు, దాసరి కృష్ణ, దాసరి వీరేష్, దాసరి కుమార్, ముంద్రాతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్కపల్లిలో మామిడి, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన



**అచ్చంపేట, అక్టోబరు 6 (వుదయం ప్రతినిధి):**

పల్కపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల్లో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఉద్యాన అధికారి కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పూ మొగ్గ దశలో వచ్చే కీటకాలు, తెగుళ్ల నివారణకు తేనెమంచి పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి మొగ్గ దశలో పిచికారీ చేయాలని సూచించారు. పూత దశలో కీటకనాశక మందులు పిచికారీ చేయవద్దని, పరాగ సంపర్క కీటకాలు చనిపోతాయని హెచ్చరించారు.పూత దశలో యూరియా వాడకం తగ్గించాలని, ఫర్టిగేషన్ లో భాగంగా డ్రిప్ ద్వారా పూత దశలో 00:52:34 ఎరువు ఎకరానికి 2 కిలోలు, పిందె దశలో 13:00:45 ఎరువు ఎకరానికి 3 కిలోల చొప్పున అందించాలని సూచించారు.ఆయిల్ పామ్ సాగుకు అందుబాటులో ఉన్న సబ్సిడీలను వివరించారు. ఎకరం వరికి వాడే నీటితో 4 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని, లాభసాటి పంటని తెలిపారు.

# వార్షిక ఉర్సు షరీఫ్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 6(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కొల్లంపల్లి లో నిర్వహించనున్న వార్షిక 552వ ఉర్సు షరీఫ్ హజ్రత్ మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా అహ్మద్ ఖత్తాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ (రహ.) ఉర్సుకు సంబంధించిన పోస్టర్లను నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం ఆవిష్కరించారు .552వ ఉర్సు షరీఫ్ సందర్భంగా అక్టోబర్ 16వ తేది శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొల్లంపల్లి దర్గా షరీఫ్ ప్రాంగణంలో 26వ అంతర్ మత సదస్సు నిర్వహించనున్నట్లు అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ, కొల్లంపల్లి ఉపాధ్యక్షులు అడ్వకేట్ అబ్దుల్ సలీం తెలిపారు.ఈ సదస్సులో గోగీ షరీఫ్ బార్గాహ్ జలాలియా సజ్జదానషీన్ సయ్యద్ షా కలీముల్లాహ్ హుస్సేనీ అధ్యక్షత వహించనున్నారు. అంతర్మత సదస్సుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపి డీకే అరుణ,ఎమ్మెల్సీ ఎన్ నవీన్ కుమార్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కోత్వాల్,జిల్లా కలెక్టర్ ప్రియాంక,జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో పాటు మతదీషులు వివిధ పార్టీ రాజకీయ నాయకులు , సంతులు,మషాయిఖ్‌లు, ఉలమాలు పాల్గొననున్నారు.
నమాజ్‌ఎఅసర్ అనంతరం బార్గాహ్ ఖత్తాలియా (రహ.)లో రస్మ్ఎపర్చమ్ కుషాయీ (పర్చమ్ జలాలియా) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉలమాలు, మషాయిఖ్‌లు పాల్గొంటారు. నమాజ్ఎ మగ్రిబ్ అనంతరం లంగర్ ఖత్తాలియా ఏర్పాటు చేయనున్నారు.
అక్టోబర్ 17, శనివారం నమాజ్ఎ ఫజర్ అనంతరం ఖాన్కాహ్ ఖత్తాలియా నుంచి సందల్ ఊరేగింపు ప్రారంభమై దర్గా షరీఫ్‌కు చేరుకుంటుంది. అక్కడ సజ్జాదానషీన్, హజ్రత్ చందా హుస్సేనీ (రహ.) మనవడు మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ చేతుల మీదుగా రస్మ్ఎసందల్ నిర్వహించబడుతుంది. నమాజ్ఎ ఇషా అనంతరం దర్గా ప్రాంగణంలో చిరాగాన్ మరియు మహ్ఫిల్ఎసమా నిర్వహించనున్నారు.అక్టోబర్ 18, ఆదివారం ఉదయం 8 గంటలకు మహ్ఫిల్ఎకుల్, తబర్రుకాత్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 552వ ఉర్సు ముబారక్‌లో అష్రఫీయా జలాలియా సిల్సిలాకు చెందిన కొల్లంపల్లి అనుబంధితులు, భక్తులు,హిందు,ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అడ్వకేట్ అబ్దుల్ సలీం, అడ్వకేట్ అమీరుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ తఖీ చాంద్, దస్తగీర్ చాంద్, సయ్యద్ ఆరిఫ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేట లో మొక్క నాటి కార్యక్రమాన్ని

# ప్రారంభించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

**వాతావరణ మార్పులను ఎదుర్కోవాలంటే చెట్ల పెంపకం తప్పనిసరి**
**భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడాలి**

**రామాయంపేట,అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**



మెదక్ జిల్లా రామాయంపేట లో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన భారీ మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల ముఖ్యఅతిథిగా హాజరై జీడిమామిడి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు 765డీజీ జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 43 కిలోమీటర్ల మేర 30 వేల కాజూ (జీడిమామిడి) మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ రహదారి వెంట పెద్ద ఎత్తున మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టారు.రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వాలకే పరిమితమైన అంశం కాదని, ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలని అన్నారు. చెట్లు మానవాళికి స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పెద్ద ఎత్తున చెట్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఒక్కరూ కనీసం కొన్ని మొక్కలను నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ మార్గాలను అవలంబించాలని సూచించారు.
ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రామాయంపేటలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రామాయంపేట-సిద్దిపేట జాతీయ రహదారి వెంట సుమారు 43 కిలోమీటర్ల మేర 30 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారి వెంట అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటమే లక్ష్యమన్నారు.
మొక్కలు నాటడం ద్వారా మాత్రమే కార్యక్రమం పూర్తికాదని, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి పెంచే బాధ్యతను కూడా తీసుకోవాలని ఎంపీ సూచించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడేందుకు సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.
జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని అన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు చెట్ల పెంపకం అత్యంత అవసరమని తెలిపారు. నాటిన మొక్కలు భవిష్యత్‌లో పెద్ద చెట్లుగా ఎదిగి ప్రజలకు నీడ, స్వచ్ఛమైన గాలి అందించేలా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నందున సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ బదులు పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకుంటే పర్యావరణ పరిరక్షణలో మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, తూప్రాన్ డీఎస్పీ నరేందర్, మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు ,సీఐ సైదానాయక్, ఎస్ఐ బాల్‌రాజ్,అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్,బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాల్‌రాజు, ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు,సర్పంచ్ బక్కయగారి యాదగిరి,వార్డు కౌన్సిలర్ శంకర్‌గౌడ్, శ్రీనివాస్,వడ్ల శ్యాములు, బీజేపీ నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ ఎల్ ఎన్ కాంపిటెంట్ స్కూల్స్‌లో

# విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక దృష్టి

**పాఠశాలల మానిటరింగ్‌ను పటిష్టంగా నిర్వహించాలి**
**ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరుపై రోజువారీ నివేదిక ఇవ్వాలి ***
**పాఠశాలలకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు**
**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 06:-వుదయ**




జిల్లాలోని ఎఫ్ ఎల్ ఎన్ (లిటరసీ అండ్ నూమెరసీ ) కాంపిటెంట్ స్కూల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానంలో నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాధించేలా సమగ్ర శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, సీహెచ్ఎంలు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎఫ్ ఎల్ ఎన్ కాంపిటెంట్ స్కూల్స్‌లో సమగ్ర శిక్షణ కార్యక్రమాల అమలు, పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలు తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ**

ఎఫ్ ఎల్ ఎన్ పాఠశాలల పర్యవేక్షణను పటిష్టంగా నిర్వహించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి విద్యా బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ (Facial Recognition System) ద్వారా క్రమం తప్పకుండా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరుకు సంబంధించిన రోజువారీ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరై, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.
వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎఫ్ఆర్ఎస్ హాజరులో ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యం ఉండకూడదని, సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాల ద్వారా ప్రతి విద్యార్థి తన తరగతి స్థాయికి అనుగుణంగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను ఎప్పటికప్పుడు అంచనా వేసి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.
పాఠశాలల పనితీరు, విద్యార్థుల అభ్యసన ఫలితాలను నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన చోట తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి రోహిణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు, ఎంఈఓలు, సీహెచ్ఎంలు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట, అక్టోబరు 6 (వుదయం ప్రతినిధి):**




పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు.
మంగళవారం అచ్చంపేటలో సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు.అనంతరం మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించి ప్రజలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఆదేశించారు.
కార్యక్రమంలో ఎంపీడీవోలు అరుంధర్ రావు, రేవతి రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రిల్స్ చేయండి... లక్ష గెలుచుకోండి

*** సిద్దిపేట జిల్లా పదేళ్ల వేడుకల సందర్భంగా భారీ పోటీలు**
*** తొలి బహుమతి రూ.1 లక్ష, ద్వితీయ రూ.50 వేలు, తృతీయ రూ.25 వేలు**
*** ఉత్తమ ఛాయాగ్రహకులకు ప్రత్యేక బహుమతులు**
*** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి ప్రకటన**

**సిద్దిపేట, అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రత్యేక వీడియోలు, లఘు చిత్రాల పోటీలు నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శాసనసభ్యుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా, సిద్దిపేట జిల్లా ఆవిర్భావం మరియు సాధించిన ప్రగతిపై దృశ్యరూపకాలను రూపొందించే వారి కోసం ఈ పోటీలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. వ్యక్తిగత ఖాతాల ద్వారా వీడియోలు చేసే వారు ఒక విభాగంగా, ప్రముఖ ఖాతాలు, అంతర్జాల వేదికల నిర్వాహకులు, ప్రముఖ వ్యక్తులు చేసే వీడియోలను మరో విభాగంగా వర్గీకరించి ఈ పోటీలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 11వ తేదీలోగా తమ వీడియాలను తయారు చేసి నిర్ణీత ఖాతాలకు మరియు సూచించిన గుర్తులకు జతపరచాలని కోరారు. విజేతలకు రెండు విభాగాల్లోనూ ప్రథమ బహుమతిగా ఒక లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతిగా 50 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 25 వేల రూపాయలు అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు ఉత్తమ ఛాయాచిత్రగాహకులు, దృశ్యచిత్రాల జర్నలిస్టులకు కూడా ప్రత్యేక బహుమతులు ఉంటాయని స్పష్టం చేశారు.

**విజేతల ఎంపికకు ప్రత్యేక కమిటీ:**

పోటీల్లోని అంశాలను పరిశీలించి విజేతలను పారదర్శకంగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక నిర్ణాయక మండలిని నియమించినట్లు చెప్పారు. ఈ మండలిలో ప్రముఖ వ్యంగ్యచిత్రకారులు నెల్లుట్ల రమణారావు, పత్రికా సంపాదకులు రంగదాంపల్లి శ్రీనివాస్ గౌడ్, అంతర్జాల వేదికల నిర్వాహకులు ఆకుల శ్రీనివాసరెడ్డి సభ్యులుగా వ్యవహరిస్తారు. సిద్దిపేట జిల్లాకు చెందిన ఏ పౌరుడైనా ఈ పోటీలలో భాగస్వామ్యం కావచ్చు. సిద్దిపేట జిల్లా ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, జిల్లా అవతరణ తర్వాత జరిగిన ప్రగతిని ప్రతిబింబించేలా దృశ్యరూపకాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సిద్దిపేట విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని కోరారు. ఈ సమావేశంలో ప్రతినిధులు ఆంజనేయులు, తిరుపతి, శేఖర్ గౌడ్, రామరాజు, రమేష్, కమల్ యాదవ్, చింటూ, సోహెల్, బత్తుల ఆకాష్, రాజశేఖర్ రెడ్డి, భాను, ఆనంద్, సాయి రెడ్డి, ప్రభాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మీ కెమెరా మాట్లాడాలి..

# పోలీసుల సేవ చాటాలి!

**ఫ్లాగ్ డే సందర్భంగా లఘుచిత్రం, ఫోటోగ్రఫీ పోటీలు**
**మూడు నిమిషాల్లో పోలీసుల సేవా స్ఫూర్తిని ఆవిష్కరించండి.. జిల్లా విజేతలకు బహుమతులు**
**టాప్–3 ఎంట్రీలకు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటే అవకాశం**

**గద్వాల్, అక్టోబర్ 6 (వుదయం బ్యూరో)**



ఒక ఫ్రేమ్ చాలు.. ఓ త్యాగగాథను చెప్పేందుకు. మూడు నిమిషాలు చాలు.. పోలీసుల సేవా స్ఫూర్తిని సమాజానికి చాటేందుకు. ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న కృషి, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు, ప్రజలతో పోలీసుల స్నేహపూర్వక సంబంధాలను సృజనాత్మకంగా ఆవిష్కరించేందుకు జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖ వినూత్న వేదికను ఏర్పాటు చేస్తోంది.
పోలీస్ ఫ్లాగ్ డే (అమరవీరుల స్మారక వారోత్సవాలు) సందర్భంగా లఘుచిత్రం, ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. సేవను చూపండి.. త్యాగాన్ని చాటండి! పోలీసుల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీస్-ప్రజల మధ్య స్నేహబంధం, అమరవీరుల త్యాగాలు, మహిళలు-చిన్నారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత, నేర నియంత్రణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను కథాంశాలుగా తీసుకుని లఘుచిత్రాలు రూపొందించవచ్చు. గరిష్టంగా మూడు నిమిషాల నిడివి కలిగిన లఘుచిత్రాలు ఉండాలి. తక్కువ సమయంలో బలమైన కథనం, ప్రభావవంతమైన సందేశం, సృజనాత్మకతను ప్రతిబింబించేలా చిత్రాలను రూపొందించాలని ఎస్పీ సూచించారు. ఒక్క క్లిక్.. ఓ కథ! ఫోటోగ్రఫీ పోటీలో పోలీసుల సేవ, సాహసం, విధి నిర్వహణ, ప్రజా భద్రత, అమరవీరుల స్మృతి వంటి అంశాలను ప్రతిబింబించే ఇటీవల తీసిన ఉత్తమ ఛాయాచిత్రాలను సమర్పించవచ్చు.
ప్రజల కోసం పోలీసులు చేస్తున్న సేవను, విధి పట్ల వారి అంకితభావాన్ని, సమాజ భద్రతలో వారి కీలక పాత్రను ఒకే ఛాయాచిత్రంలో బలంగా ప్రతిబింబించే ఫోటోలకు ప్రాధాన్యం ఉంటుంది. 23 వరకు అవకాశం.. గెలిస్తే రాష్ట్ర స్థాయి! పోటీల్లో పాల్గొనదలచిన ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగిన వారు తమ ఎంట్రీలను అక్టోబర్ 23, 2026లోపు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పి.ఆర్.ఓ నవీన్ - 8712661828కు అందజేయాలి.
జిల్లా స్థాయిలో న్యాయనిర్ణేతలు ఉత్తమ ఎంట్రీలను ఎంపిక చేస్తారు. మూడు ఉత్తమ లఘుచిత్రాలు, మూడు ఉత్తమ ఛాయాచిత్రాలకు జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.
అంతటితో అవకాశం ముగియదు. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే టాప్-3 లఘుచిత్రాలు, టాప్-3 ఛాయాచిత్రాలు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడతాయి. అక్కడ ప్రతిభ కనబరిచిన విజేతలకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ప్రతిభా పత్రాలు, బహుమతులు అందజే యనున్నారు. మీ చూపులో.. పోలీసుల సేవ పోలీసుల సేవలు కేవలం విధుల్లో కనిపించేవి మాత్రమే కాదు.. వాటిలో త్యాగం ఉంది.. బాధ్యత ఉంది.. ధైర్యం ఉంది.. మానవత్వం ఉంది. ఆ స్ఫూర్తిని మీ కెమెరా ద్వారా సమాజానికి పరిచయం చేసే అరుదైన అవకాశం ఇదని ఎస్పీ తెలిపారు.
పోలీసుల సేవా స్ఫూర్తిని, అమరవీరుల త్యాగాలను, సమాజ భద్రత కోసం పోలీసులు చేస్తున్న కృషిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఫోటోగ్రా ఫర్లు, వీడియోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ కోరారు.

# ప్లాట్ల కొనుగోలుదారులకు కుచ్చు టోపీ?

**గతంలో విక్రయించిన స్థలాలనే మళ్లీ అమ్మేందుకు యత్నం**
**. ఆందోళనలో బాధితులు**

**వెల్దండ అక్టోబర్6 (వు దయం)**



ప్లాట్లు కొనుగోలు చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకున్న వారికి కష్టాలు ఎదురవుతున్నాయి. మండలంలోని బండోనిపల్లి గ్రామంలో గతంలో విక్రయించిన ప్లాట్లనే తిరిగి విక్రయించేందుకు లేఅవుట్ నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. 2012లో బండోనిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ అనుమతితో లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 185 ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం. వాటిలో కొన్ని ప్లాట్లను కొనుగోలు చేసినవారు నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ కూడా చేయించుకున్నారు. దీంతో తమకు సొంతమైన స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్లు నిర్మించుకోవచ్చని ఆశపడ్డారు.
అయితే, ప్రస్తుతం సదరు లేఅవుట్‌లో జేసీబీల సాయంతో ప్లాట్ల నెంబర్ రాళ్లను తొలగించి, స్థలాన్ని చదును చేస్తూ మళ్లీ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే డబ్బులు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేసిన తమకు తెలియకుండా అదే స్థలాలను తిరిగి అమ్మేందుకు ప్రయత్నించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దీంతో కాయ కష్టం చేసి పైసా పైసా కూడా పెట్టుకోని దాచుకున్న సోము తో ప్లాట్లు కొనుగోలు చేస్తే తీరా ప్లాట్లకు రాలు తొలగించి మళ్లీ అమ్ముకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు.

**అధికారులు స్పందించాలి.**

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, లేఅవుట్ రికార్డులు, గతంలో జరిగిన విక్రయాలు, ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. తమ ప్లాట్లకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



**దౌల్తాబాద్ అక్టోబర్ 06(వుదయం) :**

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు ఆదేశాల మేరకు గోవిందపూర్‌కు చెందిన పెనుకుల పద్మకు రూ.51 వేల చెక్కును, సూరంపల్లి గ్రామానికి చెందిన చిందం జగన్నాథానికి రూ.28,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.అనారోగ్యంతో వైద్య చికిత్స పొందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు ఎంపీ రఘునందన్‌రావు కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కొంతమేర ఊరట కలిగిస్తుందన్నారు.కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు దేవుడి లావణ్య నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులు చిక్కుడు స్వామి, స్వామినాథ్, మండల మాజీ అధ్యక్షుడు పోతురాజు కిషన్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పిట్ల మల్లేష్, దుబ్బాక నియోజకవర్గ మన్‌కీ బాత్ కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గంగాధర్ స్వప్న స్వామి, ఉపసర్పంచ్ తాటి సాయి, గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు తైల కుమార్, మంగలి నరేష్, కోనాయపల్లి మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

